E KABURU - Digital News Paper
E-PAPER
ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 28-05-2026 (వారం) గురువారం సంపుటి: 02 || సంచిక:145 || పేజీలు–6
www.ekaburu.com

శేరిలింగంపల్లి ప్రజలు... పారాహుషార్

- అంతర్గత రహదారులపై రాకపోకలు బంద్
- ఒకేసారి అంతటా అభివృద్ధి పనుల ఫలితం
- తవ్వి వదిలేసిన రహదారులతో స్థానికుల అవస్థలు

03



03

తోటివారికి ఓ గ్లాసు నీళ్లివ్వండి

పెద్దవారిని బయటకు వెళ్లనీయకండి
ఎండలతో జాగ్రత్త
ప్రజలకు ప్రధాని సూచన

ఈ-కబురు,దిల్లీ: ఎండలతో అత్యంత అప్రమత్తంగా ఉండాలని దేశ ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచించారు. ఈ కఠిన వాతావరణంలో గరిష్ఠ జాగ్రత్తలు ఆవశ్యకమని పేర్కొన్నారు.

అకాల వర్షం అన్నదాతకు ఆవేదన

- రైతులను నిండా ముంచిన అకాల వర్షం
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- యార్డులు, ప్యాక్స్ కేంద్రాల్లోని మొక్కజొన్న మొలకెత్తే పరిస్థితి
- స్పందించిన ప్రభుత్వం.. కొనుగోళ్ల వేగం పెంచాలన్న సీఎం రేవంత్‌రెడ్డి
- తడిసిన ధాన్యాన్నీ సేకరిస్తాం: ఉత్తమ్

నర్సాపూర్‌కు చెందిన రైతు దంపతులు కరోళ్ల కనకయ్య, మంగవ్వ.. 10 ట్రాక్టర్ల ధాన్యాన్ని 15 రోజుల క్రితం సిద్దిపేటలోని మార్కెట్ యార్డుకు తెచ్చారు. తేమ శాతం, జాలి పట్టడం అయినప్పటికీ గన్నీ బ్యాగులు ఇవ్వలేదు. దీంతో యార్డులోనే ధాన్యం కుప్పలు పోసి, ఎప్పుడు కొనుగోలు చేస్తారోనని వేచి చూస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి నుంచి కురిసిన అకాల వర్షా నికి సగం ధాన్యం తడిసిపోయింది. కొంతమేర ధాన్యం వరద ప్రవాహానికి కొట్టుకుపోయింది. ఇన్నాళ్ల కష్టం నీళ్లపాలైందని వారు కన్నీటిపర్యంతమయ్యారు.

ఈ-కబురు, హైదరాబాద్:
ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునే సమయానికి ప్రకృతి మరో సారి కన్నెర్రజేసింది. మంగళవారం రాత్రి రాష్ట్రవ్యాప్తంగా కురిసిన అకాల వర్షం రైతుల కష్టాన్ని నీటిలో కలిపేసింది. పలు జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలకు ఆశగా తీసుకొచ్చిన ధాన్యం, మొక్కజొన్న వర్షానికి తడిసి ముద్దవగా.. కొన్నిచోట్ల నీటి ప్రవాహంలో ధాన్యం రాశులు కొట్టుకుపోయాయి. తమ పంట కళ్లముందే తడిసిపోతుం డటంతో రైతులు నిస్సహాయంగా చూస్తూ కన్నీళ్లు పెట్టుకున్నారు. సిద్దిపేట, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, నాగర్‌కర్నూల్, యాదాద్రి భువనగిరి, మెదక్, మహబూబాబాద్, కామారెడ్డి జిల్లాల్లో అకాల వర్షం తీవ్ర ప్రభావం చూపింది.

మిగతా 2లో

తుమ్మిడిహెట్టి 'ఎత్తు'పై చర్చిద్దాం

- అనుకూలమైన తేదీ ఖరారు చేయండి
- మహారాష్ట్ర సీఎంకు రేవంత్ లేఖ

ఈ-కబురు, హైదరాబాద్:
ప్రాణహిత నుంచి ఎల్లంపల్లికి నీటి మళ్లింపులో భాగంగా అదిలాబాద్ జిల్లా తుమ్మిడిహెట్టి వద్ద ప్రతిపాదించిన బ్యారేజీ ఎత్తుపై మహారాష్ట్రతో చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగు ముందుకేసింది. దీనిపై తెలంగాణ ప్రతినిధి బృందంతో సమావేశానికి సమయం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌కు బుధవారం లేఖ రాశారు. అనుకూలమైన తేదీని త్వరగా ఖరారు చేయాలని కోరారు. ప్రాణహితచేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించాల్సి ఉంది.

02

రైతన్నలకు అండగా నిలవాలి

రైతన్నలకు అండగా నిలవాలి

ఈ-కబురు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షా లు, ఈదురు గాలుల కారణంగా.. వ్యవసాయ మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి, మొక్కజొన్న

04

ప్రధాని దృష్టికి తమిళనాడు సమస్యలు

మోదీని కలిసిన సీఎం విజయ్

02

మేము ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే

కేటీఆర్ పోటీ చేయకుండా ఉంటారా?

- నిర్మించకపోతే నేను ఎమ్మెల్యేగా పోటీ చేయను
- ఎకరా రూ.100 కోట్లు ఉన్నా గ్రేటర్‌లో పేదలకు ఇళ్లు కట్టిస్తాం
- రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండానే కేటాయిస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఈకబురు, హైదరాబాద్: 'హైదరాబాద్ నగరంలో నాటి భారాస ప్రభుత్వ పదేళ్ల పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే వచ్చే రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ ఇళ్లు నిర్మించకపోతే నేను వచ్చే శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయను. ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే కేటీఆర్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉంటారా' అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో బుధవారం ఇళ్ల కోసం స్థలాలు పరిశీలించిన అనంతరం సచివాలయంలో

02

టీడీపీ పనిచేసేది ఎన్నికల కోసం కాదు...

నెక్స్ట్ జెనరేషన్ కోసం

- జెన్ జీ, జెన్ ఆల్ఫాకు విస్తృత అవకాశాలు... అందిపుచ్చుకోండి
- రాష్ట్రాన్ని 5 ఏళ్లు విధ్వంసం చేస్తే... రెండేళ్లలో గట్టెక్కించాం
- రక్తచరిత్ర రాసేవాళ్లు స్వర్ణాంధ్ర చరిత్ర రాయలేరు
- గొడ్డలి పార్టీకి గోల్ లేదు... అదొక అడ్డగోల్ బ్యాచ్
- మహానాడు సభలో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

03

విజయన్ ఇంట్లో ఈడీ సోదాలు

రాజకీయ దాడే!

సీపీఎం నేతలు బీవీ రాఘవులు, విజయరాఘవన్

ఈకబురు,హైదరాబాద్: 'ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తి కాగానే కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల్ని రాజకీయంగా బలహీనపరిచే ప్రయత్నాల్ని వేగవంతం చేసింది. ప్రశ్నించే వ్యక్తులే లక్ష్యంగా

03

వ్యోమగాములకు చంద్ర వాహనం

సీపీఎం నేతలు బీవీ రాఘవులు, విజయరాఘవన్

చందమామపై సులభంగా ప్రయాణించడానికి నాసా ఏర్పాట్లు 'సీఎల్‌వీ–1'వాహనాన్ని తయారు చేయనున్న ఆస్ట్రోలాబ్

2028 నాటికి సాసాకు అందజేసే అవకాశం

కర్ణాటకలో సీఎం మార్పు

మే 30న కొత్త సీఎం ప్రమాణ స్వీకారం

ఈ-కబురు, బెంగుళూర్ మే 27;
కర్ణాటకలో నాయకత్వ మార్పు దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. మంగళవారం దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు

మిగతా 2లో

సర్ చట్టబద్ధమే!

- 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్'ను సమర్థించిన సుప్రీంకోర్టు
- స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణకు జీవం వంటిదని వ్యాఖ్య
- పౌరసత్వాన్ని నిర్ధారించే అధికారం ఈసీకి లేదని స్పష్టీకరణ

02

తుమ్మిడిహెట్టి 'ఎత్తు'పై చర్చిద్దాం

ఈకబురు, హైదరాబాద్: ప్రాణహిత నుంచి ఎల్లంపల్లికి నీటి మళ్లింపులో భాగంగా అదిలాబాద్ జిల్లా తుమ్మిడిహెట్టి వద్ద ప్రతిపాదించిన బ్యారేజీ ఎత్తుపై మహారాష్ట్రతో చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగు ముందుకేసింది. దీనిపై తెలంగాణ ప్రతినిధి బృందంతో సమావేశానికి సమయం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌కు బుధవారం లేఖ రాశారు. అనుకూలమైన తేదీని త్వరగా ఖరారు చేయాలని కోరారు. ప్రాణహితచేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించాల్సి ఉంది. మొదట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో దీనిని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించాలని నిర్ణయించారు. దీని కారణంగా మహారాష్ట్రలో భూములు ముంపునకు గురికానుండడంతో అక్కడి ప్రభుత్వంతో చర్చలు జరిపింది. రెండు రాష్ట్రాల ప్రతినిధులతో కమిటీలు, అంతర్రాష్ట్ర బోర్డు ఏర్పాటయ్యాయి. సమావేశాలూ జరిగాయి. మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోయి భాజపా వచ్చాక 152 మీటర్ల ఎత్తుకు సానుకూలంగా స్పందించలేదు.

తాజాగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి గ్రావిటీ ద్వారా ఎల్లంపల్లికి నీటిని మళ్లించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నీటిపారుదల శాఖకు సూచించారు. 148 మీటర్ల పూర్తి రిజర్వాయర్ లెవెల్ ఉత్తర తెలంగాణ నీటి అవసరాలకు సరిపోదని నిపుణుల సూచనలతో ప్రభుత్వం అంచనాకు వచ్చింది. ఈ నేపథ్యంలోనే ఎత్తుపై మళ్లీ మహారాష్ట్రతో చర్చలు జరిపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారు. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో సాగునీరు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తుపై మరోసారి చర్చ అవసరమని తన లేఖలో ప్రస్తావించారు. ''2016 ఆగస్టు 23న జరిగిన ఇంటర్ స్టేట్ బోర్డు సమావేశంలో తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. అవసరమైన అనుమతులు పొందేందుకు సహకారం అందిస్తామని కూడా అప్పట్లో తెలిపింది'' అని గుర్తుచేశారు. 148 మీటర్ల కంటే కొంత ఎక్కువ ఎఫ్ఆర్ఎల్ పరిశీలించినా, మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువగానే ఉంటుందని సీఎం వివరించారు. ఎఫ్ఆర్ఎల్ పెరిగితేనే గ్రావిటీ ద్వారా నీటిని తెచ్చుకునే వీలుందని వెల్లడించారు.

ప్రధాని దృష్టికి తమిళనాడు సమస్యలు

ఈకబురు, చెన్నై, తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ బుధవారం ప్రధాని నరేంద్ర మోదీని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎంగా బాధ్యతలు చేపట్టాక విజయ్ తొలిసారి దిల్లీ వెళ్లారు. ప్రధాని ఇటీవల నెదర్లాండ్స్‌లో పర్యటించిన సందర్భంగా ఆనైమంగళ రాగి పలకలను భారత్‌కు తిరిగి తీసుకొచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రానికి సంబంధించిన పలు డిమాండ్లను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో తమిళతల్లి ప్రార్థనా గీతాన్ని ఎప్పటిలాగే ప్రారంభంలో ఆలపించడానికి తగిన స్పష్టతను కేంద్ర హోంశాఖ ద్వారా అందించాలని కోరారు. అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ), సెంటర్ ఫర్ ఎయిర్ బోర్న్ సిస్టమ్స్ (సీఏబీఎస్) యూనిట్లను రాష్ట్రంలో ఏర్పాటు చేయడంపై డీఆర్‌డీఓ కొన్నాళ్లుగా ఆలోచిస్తున్నందున.. వాటి గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రధానికి విన్నవించారు. రాష్ట్రానికి చెందిన మత్స్యకారులను శ్రీలంక నౌకాదళం అరెస్టు చేస్తోందని, ప్రస్తుతం ఆ దేశ కస్టడీలో ఉన్న 58 మంది జాలర్లు, 266 ఫిషింగ్ బోట్లను విడిపించడానికి చర్యలు చేపట్టాలని విజయ్ విన్నవించారు.

అకాల వర్షం.. అన్నదాతకు ఆవేదన

ఈకబురు, హైదరాబాద్: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునే సమయానికి ప్రకృతి మరోసారి కన్నెర్రజేసింది. మంగళవారం రాత్రి రాష్ట్రవ్యాప్తంగా కురిసిన అకాల వర్షం రైతుల కష్టాన్ని నీటిలో కలిపేసింది. పలు జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలకు ఆశగా తీసుకొచ్చిన ధాన్యం, మొక్కజొన్న వర్షానికి తడిసిముద్దవగా.. కొన్నిచోట్ల నీటి ప్రవాహంలో ధాన్యం రాశులు కొట్టుకుపోయాయి. తమ పంట కళ్ల ముందే తడిసిపోతుండటంతో రైతులు నిస్సహాయంగా చూస్తూ కన్నీళ్లు పెట్టుకున్నారు. సిద్దిపేట, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, నాగర్‌కర్నూల్, యాదాద్రి భువనగిరి, మెదక్, మహబూబాబాద్, కామారెడ్డి జిల్లాల్లో అకాల వర్షం తీవ్ర ప్రభావం చూపింది.

కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి నిల్వ ఉంచిన ధాన్యం బస్తాల్లోకి నీరు చేరడంతో రైతులు మళ్లీ వాటిని ఎండబెట్టుకునే పరిస్థితి ఏర్పడింది. కొన్నిచోట్ల రైతులు రాత్రివేళ కుటుంబ సభ్యులతో కలిసి ధాన్యం నిల్వలు తడవకుండా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కాంట్రాక్ట్ లారీలు సమయానికి రాకపోవడంతో ధాన్యం బస్తాలు కేంద్రాల్లోనే పేరుకుపోయాయి. వర్షం మొదలవగానే రైతులు పరుగులు తీస్తూ బస్తాలపై ప్లాస్టిక్ కవర్లు కప్పినా ప్రయోజనం లేకపోయింది. కొన్ని కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు లేక రైతులు రాత్రంతా వానలోనే ధాన్యానికి కాపలా కాశారు. మొక్కజొన్న రైతుల పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉంది.

వారాల తరబడి మొక్కజొన్నను కొనుగోలు చేయకుండా మార్కెట్ యార్డులు, పీఏసీఎస్‌లలోనే నిల్వ ఉంచుతుండటంతో... తడిసిన మొక్కజొన్న మొలకెత్తే పరిస్థితి తలెత్తింది. కొనుగోళ్లలో జాప్యం, గన్నీ సంచుల కొరత, లారీల లేమి కారణంగానే ఈ నష్టం జరిగిందని రైతులు ఆరోపిస్తున్నారు. కాగా అకాల వర్షంతో పలు జిల్లాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. కొనుగోళ్లలో వేగం పెంచాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. అకాల వర్షానికి తడిసిన వడ్లను పౌరసరఫరాల శాఖ కొనుగోలు చేస్తుందని, ఆందోళన చెందొద్దని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు.

జిల్లాల వారీగా పరిస్థితి ఇదీ...

మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో వడ్లు తడిసిపోయాయి. 'వారం రోజులుగా లారీలు వస్తాయని చెబుతున్నారు.. ఇప్పటికీ రాలేదు. ఒక్క వానతో మా కష్టం అంతా పోయింది' అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నశంకరంపేట మండలంలోని శాలిపేట, సూరారం కొనుగోలు కేంద్రాల్లో కూడా రోజుల తరబడి లారీలు రాకపోవడంతో ధాన్యం ఎండకు ఎండి, వానకు తడిసే పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల తడిసిన మొక్కజొన్న మొలకెత్తే పరిస్థితి ఏర్పడింది. మెదక్, హవేలీ ఘనాపూర్, పాపన్నపేట, కుల్చారం, కౌడిపల్లి, చిలిపిచేడ్, రామాయంపేట, చేగుంట మండలాల్లో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం వర్షానికి పూర్తిగా తడిసిపోయింది. నిజాంపేట మండలంలో కల్లాలు లేక రైతులు రహదారులపైనే ధాన్యం ఆరబోసుకున్నారు. వర్షం రావడంతో రోడ్లపై ఉన్న వడ్ల కుప్పలు పూర్తిగా తడిసిపోయాయి.

కామారెడ్డి జిల్లా రాజంపేట ప్రాంతంలో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. సదాశివనగర్ మండలం మల్లుపేట, ఎల్లారెడ్డి పరిసరాల్లో కొనుగోలు కేంద్రాల్లోని వరి ధాన్యం తడిచిపోయింది.

జగిత్యాల జిల్లా ధర్మపురి మార్కెట్ యార్డులో వర్షం కారణంగా ధాన్యం, మక్కలు తడిశాయి.

పెద్దపల్లి, మంథని ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న వడ్ల కుప్పలు, బస్తాలు పూర్తిగా తడిచిపోయాయి. బలమైన గాలులకు టార్పాలిన్లు ఎగిరిపోవడంతో వర్షపు నీరు ధాన్యంలోకి చేరింది.

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేట కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం వర్షా నికి తడిసిపోయింది. రాత్రివేళ రైతులు ప్లాస్టిక్ షీట్లు కప్పి కాపాడేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది.

మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలంలో పంటలను కాపాడేందుకు వెళ్లిన నలుగురు రైతులు గోడ కూలి మృతి చెందిన ఘటన అకాల వర్షాల తీవ్రతను ప్రతిబింబిస్తోంది.

రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు, హమాలీలు, లారీలు లేకపోవడం వల్లే ధాన్యం ఎక్కువ రోజులు కేంద్రాల్లోనే నిల్వ ఉండిపోయిందని రైతులు ఆరోపిస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అచ్చంపేట మార్కెట్‌కు వడ్లు తీసుకొచ్చి చాలా రోజులైనా కాంటా వేయలేదు. కుప్పలుగా పోసిన ధాన్యం మంగళవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి తడిసింది. నిద్రిస్తున్న సమయంలో భారీ వర్షం రావడంతో ధాన్యం వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. కనీసం తడిసిన వడ్లను వెంటనే కొనాలి.

-రషీదా, మల్లెల తీర్థం, నాగర్ కర్నూల్ జిల్లా

చివరి గింజ వరకూ కొంటాం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, చివరి గింజ వరకు కొనుగోలు చేయడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పరిస్థితిపై ఉత్తమ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, కలెక్టర్లు, పోలీస్, రవాణా శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. ఇప్పటికే తడిసిన 9,214 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించినట్లు తెలిపారు.

కొనుగోలు చేసిన ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించేందుకు ఇసుక రవాణా లారీలను కూడా వినియోగిస్తున్నామని చెప్పారు. రైతులకు ఇప్పటికే రూ.10,097 కోట్ల చెల్లింపులు జరిగాయని, దీనివల్ల 8.15 లక్షల మంది రైతులు లబ్ధి పొందినట్లు పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యంలో 44.67 లక్షల మెట్రిక్ టన్నులు సాధారణ రకాలు కాగా, 12.33 లక్షల మెట్రిక్ టన్నులు సన్న ధాన్యమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం సేకరణ చేపడుతున్నామని చెప్పారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధి కోసం అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. రైతులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ తగిన చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

మేము ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే కేటీఆర్ పోటీ చేయకుండా ఉంటారా?

ఈకబురు, హైదరాబాద్: 'హైదరాబాద్ నగరంలో నాటి భారాస ప్రభుత్వ పదేళ్ల పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే వచ్చే రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ ఇళ్లు నిర్మించకపోతే నేను వచ్చే శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయను. ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే కేటీఆర్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉంటారా' అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో బుధవారం ఇళ్ల కోసం స్థలాలు పరిశీలించిన అనంతరం సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి మంత్రి పొంగులేటి విలేకరుల సమావేశం నిర్వహించారు. ''పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు స్థలాల కోసం బుధవారం మంత్రి అజారుద్దీన్, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి సుమారు 13 ప్రాంతాలను పరిశీలించాం. మొత్తం 39 ప్రాంతాలకు చెందిన భూముల రికార్డుల్ని చూశాం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రెవెన్యూ, హౌసింగ్, ఆర్‌అండ్‌బీ, పురపాలక స్థలాలను చూశాం. ఎకరా విలువ రూ.75 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు ఉంది. ఈ భూముల విలువ ఎంత ఉన్నా ఇక్కడ పేదల ఆత్మగౌరవం కోసం ఇళ్లు నిర్మించి ఇస్తాం. మొదటి విడతలో లక్ష ఇళ్లను కడతాం. రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండానే పేదలకు కేటాయిస్తాం. పనులకు త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారు.

నాటి పాలకులు 35 కిలో మీటర్ల దూరంలో ఇళ్లు కట్టిస్తే పేదలు ఇబ్బందులు పడ్డారు..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నియోజకవర్గం యూనిట్‌గా తీసుకుని పేదలు నివసించే ప్రాంతంలోనే ఇళ్లను కట్టించి ఇస్తాం. భారాస హయాంలో ప్రజలు ఉంటున్న ప్రాంతానికి 30 నుంచి 35 కిలోమీటర్ల దూరంలో ఇళ్లను కట్టింది. అంతదూరం వెళ్లలేక, జీవనోపాధిని కోల్పోతామని పేదలు చాలా ఇబ్బందులు పడ్డారు. ఆ ప్రభుత్వం 45 వేల ఇళ్లను పూర్తి చేసింది. 21 వేల ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. వాటిని పూర్తి చేస్తున్నాం. మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఉమ్మడి ఏపీలో 45 ఏళ్ల కిందట అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లను చూశాం. అవి పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత శిథిలావస్థకు చేరిన ఈ ఇళ్ల నుంచి ప్రజలను ఖాళీ చేయించాలని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు ప్రభుత్వానికి లేఖ రాసినా పట్టించుకోలేదు. వాటిని చూస్తే బాధేసింది. గ్రేటర్‌లోని మొదటి విడత ఇళ్లకు ఒక ఆకృతి వచ్చిన తర్వాత రెండో విడత కూడా మంజూరు చేస్తాం. ఓఆర్ఆర్ పరిధిలోని నియోజకవర్గాలలో ఇళ్ల స్థలాలు లేని కారణంగా 18వేల మందికే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి ప్రొసీడింగ్స్ ఇచ్చాం'' అని పొంగులేటి వివరించారు.

హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... 'రాష్ట్రంలో 12 వేల పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 10 వేల పంచాయతీల్లో భారాస ప్రభుత్వం పదేళ్లలో ఒక్క ఇల్లూ కట్టలేదు. కట్టినట్లు నిరూపిస్తే వారు ఏ నిర్ణయం చేస్తే దానికి కట్టుబడి ఉంటాం. మా ప్రభుత్వం 10 వేల పంచాయతీల్లో ఇళ్లు నిర్మించింది. దీనిని నిరూపిస్తాం' అని అన్నారు.

కర్ణాటకలో సీఎం మార్పు

ఈకబురు,, బెంగుళూర్ మే 27;

కర్ణాటకలో నాయకత్వ మార్పు దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. మంగళవారం దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీతో కర్ణాటక సీఎం సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సమావేశమైన తర్వాత పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. సీఎం సిద్దరామయ్య గురువారం రాజీనామా చేస్తారని విస్తృత ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో సిద్దరామయ్య గురువారం గవర్నర్‌ను సమయం కోరడం, నాయకత్వ మార్పుపై అప్పుడే మాట్లాడతానని చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా మే 30న కొత్త సీఎం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు కాంగ్రెస్ వర్గాల సమాచారం.

శివకుమార్‌తో అల్పాహార సమావేశం

మంగళవారం దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీతో జరిగిన భేటీలో నాయకత్వ మార్పుపై అసలు చర్చే జరగలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పష్టంగా చెప్పినప్పటికీ మార్పు దిశగా అడుగులు పడుతున్నాయి. ముఖ్యమంత్రి సిద్దరామయ్య గురువారం కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్ అపాయింట్‌మెంట్ కోరినట్లు సీఎంఓ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ వర్గాల సమాచారం ప్రకారం సిద్దరామయ్య తన రాజీనామాను గవర్నర్ గెహ్లోత్‌కు సమర్పించే అవకాశం ఉంది. సిద్దరామయ్య తన అధికారిక నివాసం 'కావేరి'లో గురువారం ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఇతర మంత్రివర్గ సహచరులతో అల్పాహార సమావేశం నిర్వహించనున్నారు. మాజీ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా బెంగళూరులోని విధాన సౌధలో ఆయనకు సీఎం నివాళులు అర్పించారు. తర్వాత సీఎం మార్పునకు సంబంధించి అడిగిన ప్రశ్నలపై గురువారమే మాట్లాడతానని సిద్దరామయ్య చెప్పారు.

–విడివిడిగా కలిసిన నేతలు

దిల్లీలో మంగళవారం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలు సిద్దరామయ్య, శివకుమార్‌లతో విడివిడిగా సమావేశయ్యారు. వారితో సుదీర్ఘ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా పదవి నుంచి తప్పుకోవాలని సిద్దరామయ్యను అధిష్ఠానం కోరినట్లు సమాచారం. సిద్దరామయ్యకు రాజ్యసభ స్థానం, కేంద్ర స్థాయిలో కీలక పాత్ర ఇవ్వజూపినట్లు వచ్చాయి. అయితే రాజ్యసభ ఎన్నికలు, కర్ణాటక శాసనమండలి ఎన్నికల గురించే చర్చించినట్లు సమావేశం తర్వాత కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చెప్పారు. నాయకత్వ మార్పు గురించి కాదని చెప్పారు.

చెరోసగం రోజులు పాలిద్దాం!

గతేడాది కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్నప్పటి నుంచి నాయకత్వ మార్పుపై ఊహాగానాలు మొదలయ్యాయి. గత 18 నెలలుగా డీకే శివకుమార్ అనుచరులు ఆయన ముఖ్యమంత్రి బాధ్యతలు చేపడతారని చెబుతున్నారు. ఇదేసమయంలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు సీనియర్ కాంగ్రెస్ నేత జి. పరమేశ్వరకు సీఎంగా అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. కాంగ్రెస్ కర్ణాటక వ్యవహారాల బాధ్యుడు రణదీప్ సూర్జేవాలా బెంగళూరులో కాంగ్రెస్ నాయకులతో సమావేశమై నాయకత్వ మార్పుపై స్పష్టత ఇచ్చే అవకాశముందని సమాచారం.

సర్ చటబదమే!

ఈకబురు, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఎన్నికల కమిషన్ అమలు చేస్తున్న ఓటరు జాబితా 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-సర్'పై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ ప్రక్రియ చట్టబద్ధమైన ప్రక్రియ అని స్పష్టం చేసింది. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణకు ఇది జీవ నాడి వంటిదని వ్యాఖ్యానించింది. వివిధ రాష్ట్రాలు ముఖ్యంగా బిహార్, బెంగాల్‌లలో చేపట్టిన సర్‌పై ప్రతిపక్షాలు తీవ్ర ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన ఈ తీర్పును ఎన్నికల కమిషన్ సాధించిన ఘన విజయంగా భావిస్తున్నారు. సర్ ప్రజాప్రాతినిధ్య చట్టం-1960లోని నిబంధనలకు ఏమాత్రం విరుద్ధం కాదని తేల్చిచెప్పింది. ప్రజాస్వామ్య ప్రక్రియ విశ్వసనీయత ఓటరు జాబితా కచ్చితత్వంపైనే ఆధారపడి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఈ ప్రక్రియను కేవలం పరిపాలనా పరమైన సౌలభ్యం కోసం చేపట్టినట్లుగా తాము నిర్ధారించలేకపోతున్నామని తెలిపింది. ఎన్నికల కమిషన్ తన అధికార పరిధిని దాటి వ్యవహరించిందనే వాదనలను తోసిపుచ్చిన ధర్మాసనం..ఎన్నికలను నిష్పక్షపాతంగా జరపాలన్న రాజ్యాంగం నిబంధనలకు సర్ ప్రాణం పోస్తుందని వ్యాఖ్యానించింది. అయితే, ఓటరు జాబితా సవరణ ద్వారా ఒక వ్యక్తి పౌరసత్వాన్ని అంతిమంగా నిర్ధారించే అధికారం మాత్రం ఈసీకి లేదని స్పష్టం చేసింది. అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫామ్స్ తదితరుల పిటిషన్లపై జనవరిలో విచారణ ముగించిన ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ సారథ్యంలోని ధర్మాసనం ఈ మేరకు బుధవారం 124 పేజీల సవివర తీర్పు వెలువరించింది.

జాబితా ప్రక్షాళన ఈసీ అధికారమే

ఓటర్ల జాబితాలో ఒకసారి పేరు నమోదైన తర్వాత, దానిపై మళ్లీ కొత్తగా విచారణ జరిపి పేర్లను తొలగించే అధికారం ఎన్నికల సంఘానికి ఉండదని పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదించారు. జాబితా సవరణ పేరుతో ఈసీ చేపట్టిన తొలగింపులు నిబంధన 21ఏకు విరుద్ధమని వారన్నారు. అలాగే, ఓటరు నమోదు, ధ్రువీకరణలకు సంబంధించి పత్రాల పరిశీలన కోసం ఈసీ విధించిన నిబంధనలు ఏకపక్షంగా ఉన్నాయని, వీటి కారణంగా ఎందరో ఓటు హక్కును కోల్పోతున్నారని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం ఎన్నికల సంఘం చర్యలను సమర్థించింది. ఓటరు జాబితాలో పేరు ఉండటం ఒక గుర్తింపే అయినప్పటికీ, దాన్ని మళ్లీ పరిశీలించకూడదన్న నియమం ఏదీ లేదని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియను, ఓటర్ల జాబితాను పారదర్శకంగా ఉంచేందుకు ఇలాంటి సవరణలు (ఎస్ఐఆర్) చేపట్టే పూర్తి అధికారం ఈసీకి ఉంటుందని వ్యాఖ్యానించింది.

పత్రాల పరిశీలనకు ఈసీ విధించిన నిబంధనలు పరీక్షకు నిలబడతాయని, అవి పూర్తిగా సహేతుకమైనవేనని తెలిపింది. అయితే, ఒక వ్యక్తి పౌరసత్వంపై ఈసీ కేవలం ప్రాథమిక విచారణ మాత్రమే చేయగలదని, పౌరసత్వాన్ని అంతిమంగా నిర్ధారించే అధికారం ఆ సంస్థకు లేదని కోర్టు స్పష్టం చేసింది. ఈసీ తీసుకునే నిర్ణయం కేవలం ఎన్నికల ప్రయోజనాలకు మాత్రమే పరిమితం అవుతుందని, పౌరసత్వ చట్టం కింద సదరు వ్యక్తులు తమ హక్కులు కోల్పోయినట్లు భావించరాదని ధర్మాసనం స్పష్టం చేసింది.

అనుమానిత కేసులన్నీ అథారిటీకే

సర్‌లో ముందుగా ఈసీ నోటీసులిచ్చి, సంబంధిత వ్యక్తుల నుంచి వివరణ తీసుకునే విధానాన్ని పాటించినందున ఈ ప్రక్రియ చట్టబద్ధంగా అమలైందని ధర్మాసనం తుది తీర్పులో పేర్కొంది. అయితే, 2003 జాబితా నుంచి భారత పౌరులు కారు అనే కారణంతో తొలగింపునకు గురైన వారి కేసులన్నిటినీ నాలుగు వారాల్లోగా పౌరసత్వ చట్టం-1955 కింద ఏర్పాటు చేసిన 'కాంపిటెంట్ అథారిటీ'కి తప్పనిసరిగా పంపాలని ఆదేశించింది.

ఆ అథారిటీ చట్టబద్ధంగా విచారణ జరిపి వారు భారత పౌరులే అని తేల్చితే, ఆ పేర్లను తిరిగి జాబితాలో చేర్చాలని స్పష్టం చేసింది. మరణించినవారు, వలస వెళ్లిన వారు లేదా నకిలీలు అనే కారణాలతో పౌరపాటున జాబితా నుంచి తొలగింపునకు గురైన వారు న్యాయ సమీక్ష ద్వారా ఈసీ నిర్ణయాన్ని సవాల్ చేసే అవకాశం కూడా ఉందని ధర్మాసనం వివరించింది.

పౌరసత్వానికి ఆధార్ ధ్రువీకరణ కాదు

సర్ కోసం ఎన్నికల కమిషన్ అమలు చేసిన ధ్రువీకరణ పత్రాల విధానాన్ని ధర్మాసనం సమర్థించింది. ఎన్నికల సంఘం అనుమతిస్తున్న డాక్యుమెంటేషన్ ప్రమాణాలపై అభ్యంతరాలను ధర్మాసనం కొట్టివేసింది. ఓటర్ల జాబితాల తయారీ ఒక యాంత్రిక ప్రక్రియ కాదు, అదొక ప్రాథమిక రాజ్యాంగబద్ధమైన విధి అని తీర్పునొక్కి చెప్పింది. నివాసం, అర్హత వంటి చట్టబద్ధమైన నిబంధనల నిర్ధారించే హక్కు ఈసీకి ఉందని పేర్కొంది. అదేవిధంగా, ఆధార్ పౌరసత్వానికి రుజువు కాదని కూడా తెలిపింది. 12 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య (ఆధార్) చట్టం ప్రకారం ఆ కార్డును పౌరసత్వానికి, స్థానికతకు నిరూపణగా పరిగణించలేమని స్పష్టం చేసింది.

ఓటు హక్కుకు అవసరమైన చట్టబద్ధ అర్హతగా దీనిని పరిగణించకపోవడంలో ఈసీ నిర్ణయం సరైందేనని పేర్కొంది. ఒక వ్యక్తి గుర్తింపును ధ్రువీకరించే పరిమిత ప్రయోజనం కోసం మాత్రమే ఆధార్‌ను ఉపయోగించాలని తెలిపింది. ఓటర్ల ముమ్మర సర్వే కోసం నిర్దేశించిన పత్రాల జాబితా నుంచి రేషన్ కార్డులను మినహాయిస్తూ ఈసీ తీసుకున్న నిర్ణయాన్ని ధర్మాసనం సమర్థించింది. సర్ ప్రక్రియకు అనుగుణంగా రేషన్ కార్డుల స్థానంలో మరింత విశ్వసనీయమైన పత్రాలను కోరడం, కొన్ని రకాల పత్రాలను మార్చడం వంటి విచక్షణాధికారాలు ఈసీకి ఉన్నాయని తీర్పులో పేర్కొంది.

శేరిలింగంపల్లి ప్రజలు... పారాహుషార్

- అంతర్గత రహదారులపై రాకపోకలు బంద్
- ఒకేసారి అంతటా అభివృద్ధి పనుల ఫలితం
- తవ్వి వదిలేసిన రహదారులతో స్థానికుల అవస్థలు

రోడ్డును తవ్వడంతో నెలన్నరగా శివాజీ నగర్ కు నిలిచిన రాకపోకలు

ఈకబురు, శేరిలింగంపల్లి : హైటెక్ మండలం శేరి లింగంపల్లి నియోజకవర్గం ప్రజలు వింత పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఆనందపడాలో... లేక ఒకేసారి అన్ని రహదారులను అభివృద్ధి పనుల పేరుతో మూసివేసారని బాధపడాలో తెలియని అయోమయంలో పడిపోయారు. ప్రస్తుతం ఏ అంతర్గత రహదారి చూసినా.. అయితే పైప్ లైన్ పనుల కోసం మూసి వేయడం లేదా రహదారి మరమ్మతుల కోసం తవ్వి వదిలేయడం కనిపిస్తుంది. దీని కారణంగా అంతర్గత రహదారులపై రాకపోకలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలల తరబడి పనులు పూర్తి చేయకుండా సాగదీస్తుండడంతో స్థానికులు ఆపసోపాలు పడుతున్నారు. ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాల్సిన అధికారులు అనాలోచిత నిర్ణయాలతో ఒకేసారి రహదారులను మొత్తం అభివృద్ధి పనుల కోసం తవ్వి వదిలేయడం ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. కొన్ని కాలనీలకు నెలల తరబడి వాహనాలు వెళ్లే వీలు లేకుండా పోయింది. ముఖ్యంగా చందానగర్ జాతీయ రహదారి నుంచి లింగంపల్లి వైపు వెళ్లే వాహనదారులకు రహదారులన్నీ మూసుకుపోయాయి. వివిధ అభివృద్ధి పనుల కోసం రైల్వే స్టేషన్ రోడ్డు, పిజేఆర్ స్టేడియం రోడ్డు, హుడా కాలనీ రోడ్డు మూసివేయడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏదైనా రహదారి పై అభివృద్ధి పనులు చేపడితే తాత్కాలికంగా స్థానికులకు ప్రత్యామ్నాయ రహదారి చూపించాల్సి ఉండగా, అధికారులు ఉన్న రహదారులు మొత్తం ఒకేసారి మూసివేయడం ఇబ్బందికరంగా మారింది.

సీసీ రోడ్డు నిర్మాణం కోసం చందానగర్ రైల్వే స్టేషన్ రోడ్డు బంద్

పీజేఆర్ స్టేడియం రోడ్డుపై కొనసాగుతున్న పైప్ లైన్ పనులు

- గంగారాం ప్రధాన రహదారి నుంచి చందానగర్ రైల్వే స్టేషన్ వెళ్లే రహదారిని సీసీ రోడ్డు నిర్మాణం కోసం గత నెల రోజులుగా మూసివేశారు.
- చందానగర్ హుడా కాలనీ రహదారిని సైతం మరమ్మతుల కోసం మూసివేయడంతో రాకపోకలు నిలిచిపోయాయి.
- చందానగర్ నుంచి పీజేఆర్ స్టేడియం మీదుగా వచ్చే రహదారిని స్టేడియం వెనుక పైప్ లైన్ నిర్మాణం కోసం మూసివేశారు.
- లింగంపల్లి శివాజీ నగర్ లో నెలన్నర క్రితం పైప్ లైన్ కోసం రోడ్డును తవ్వి వదిలేయడంతో కాలనీలోకి రాకపోకలు నిలిచిపోయాయి.
- మాధినగూడ రామకృష్ణ నగర్ లో తవ్వి వదిలేసిన రహదారి నిర్మాణం కోసం మూడు నెలల సమయం తీసుకోగా, ప్రస్తుతం రోడ్డు పూర్తయినా.. జాతీయ రహదారి విస్తరణ పనులతో మరోసారి రోడ్డు మూసివేశారు.

అంజయ్యనగర్ లో వీధిదీపాల ఏర్పాటుకు ఆంజనేయులు సాగర్ చొరవ

అంజయ్య నగర్ లో స్ట్రీట్ లైట్ల ఏర్పాటును పరిశీలిస్తున్న ఆంజనేయులు సాగర్

సిద్ధిక్ నగర్ లో వీధిదీపాలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి : ఆంజనేయులు సాగర్

ఈకబురు, శేరిలింగంపల్లి : అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్, సిద్ధిక్ నగర్ కాలనీలలో వెలుగులు నింపేందుకు స్థానిక సీనియర్ నాయకులు ఆంజనేయులు సాగర్ ప్రత్యేక చొరవ తీసుకొని ముందుకు రావడంతో వీధి దీపాల సమస్య తీరి రహదారులు వెలుగులు నింపుకున్నాయి. అంజయ్య నగర్ ,సిద్ధిక్ నగర్ కాలనీలో రాత్రివేళ వీధి దీపాలు లేక చీకట్లు ముసురుకుంటున్న విషయాన్ని అధికారుల దృష్టికి ఆంజనేయులు సాగర్ తీసుకువెళ్లడంతో మునిసిపల్ అధికారులు స్పందించారు. ఈ మేరకు బుధవారం వీధి దీపాల ఏర్పాట్లు చేపట్టగా, ఆంజనేయులు సాగర్ దగ్గరుండి రెండు కాలనీల్లో స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ కాలనీ అంతర్గత రహదారుల్లో వీధి దీపాలు లేక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చీకట్లు కొమ్ముకోవడంతో భద్రతాపరమైన సమస్యలు ఏర్పడుతున్నాయని, వీధి దీపాలు లేక రాత్రివేళల్లో ప్రయాణించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. ఈ విషయమై తాము అధికారులకు విన్నవించడంతో మున్సిపల్ అధికారులు స్పందించి వీధి దీపాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కాగా వీధి దీపాల ఏర్పాటు కోసం ఆంజనేయులు సాగర్ చేసిన కృషిని అభినందించిన స్థానికులు, ప్రజల మౌలిక వసతుల కల్పన కోసం ఆయన చేస్తున్న పనులకు కృతజ్ఞతలు తెలిపారు.

కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

ఈకబురు, శేరిలింగంపల్లి : కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయంలో అక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదుల మేరకు ఏసీబీ అధికారులు ఈ సోదాలు చేపట్టారు. ఈ సోదాలను ఏసీబీ డీఎస్పీలు మాజిద్ అలి ఖాన్, చలపతిరావుల ఆధ్వర్యంలో నలుగురు ఇనిస్పెక్టర్ల నేతృత్వంలో కొనసాగాయి. బుధవారం ఉదయం కార్యాలయానికి చేరుకున్న అధికారులు వెంటనే ప్రధాన గేట్లను మూసివేసి, లోపల ఉన్న సిబ్బందిని ఎవరినీ బయటకు వెళ్లనివ్వకుండా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు..కార్యాలయంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఫైల్స్, వాహనాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ, అందులో జరుగుతున్న జాప్యంపై ఏసీబీ అధికారులు ఆరా తీశారు..ఆర్టీఏ కార్యాలయంలోని అధికారుల అండదండలతో ఏజెంట్లు, డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు దందాలు చేస్తున్నారని పలు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలోనే ఆకస్మిక దాడులు నిర్వహించగా... ఆర్టీఏ కార్యాలయంలో ఏజెంట్ల ద్వారా అక్రమంగా డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు జారీ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.. ఈ మేరకు విధుల్లో ఉన్న అధికారుల పనితీరును, వారు నిర్వహించిన ఫైల్స్‌ను ఏసీబీ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

ఆర్టీఏ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

టీడీపీ పనిచేసేది ఎన్నికల కోసం కాదు... నెక్స్ట్ జెనరేషన్ కోసం

వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని తిరిగి నిలబెట్టేలా రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం పనిచేసిందని చెప్పారు. పాలనలో అగ్రెసివ్‌గా, ప్రోగ్రెసివ్‌గా ముందుకు వెళ్తున్నామన్నారు. మహిళల సాధికారత, రాష్ట్రానికి పెట్టుబడులు యువతకు అవకాశాలు, ప్రతీ ఎకరానికి సాగునీరు, అద్భుత రాజధానిగా అమరావతి నిర్మాణం, పేద వారికి సైతం అత్యుత్తమ వైద్యం, అందరికీ చదువు, అసమానతలు రూపుమాపడం, స్వర్ణాంధ్రను సాధించడమే టీడీపీ లక్ష్యమని... ప్రజలు ఇచ్చిన అఖండ విజయానికి సంక్షేమంఅభివృద్ధిసుపరిపాలనతో రుణం తీర్చుకుంటున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయం వేదికగా బుధవారం జరిగిన మహానాడు సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం సాధించిన విజయాలు, పార్టీకి దిశా నిర్దేశంతో సీఎం ప్రసంగం సాగింది. రెండు రోజుల పాటు సాగే వర్చువల్ మహానాడుకు భారీ స్పందన వచ్చింది. మహానాడు ప్రారంభ సమయంలోనే భారీగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. 1,864 క్లస్టర్ల నుంచి దాదాపు 2.23 లక్షల మంది మహానాడు కార్యక్రమానికి హాజరయ్యారు. వర్చ్యువల్ మీటింగ్‌పైన కార్యకర్తలు ఎంతో ఆసక్తి కనబరిచారు.

కార్యకర్తల్లో జోష్ తగ్గలేదు

జై తెలుగుదేశం నినాదంతో ప్రసంగాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి... వర్చువల్ మహానాడు కారణంగా వాహనాల హోరు తగ్గిందేమో కానీ, కార్యకర్తల్లో జోష్ తగ్గలేదన్నారు. అన్ని క్లస్టర్లను అనుసంధానించి మహానాడును నిర్వహించుకుంటున్నామని, పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కారణంగా మహానాడును ఈసారి హైబ్రీడ్ పద్ధతిలో జరుపుతున్నామని చెప్పారు. మీటింగ్ మోడల్ మారిందే తప్ప... మహానాడు విధానం మారలేదన్నారు. కూడు, గూడు, గుడ్డ నినాదంతో ఆవిర్భవించిన టీడీపీ... విజన్ పాలిటిక్స్‌కు రూపం ఇచ్చిందన్నారు. జాతీయ జెండా దేశానికి గౌరవం, పసుపు జెండా తెలుగువారికి ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసంగా సీఎం చంద్రబాబు అభివర్ణించారు. ప్రతీ ఒక్కరికీ తెలుగుదేశం జెండా చూస్తేనే నమ్మకం, ధైర్యం, భరోసా కలుగుతుందన్నారు. నాటికి, నేటికి తెలుగుదేశం పార్టీపై ప్రజల్లో ఆదరణ మాత్రం చెక్కు చెదరలేదన్నారు. దాడులు, హింస, హత్యా రాజకీయాలు, అక్రమ కేసులు, వేధింపులు ఎదురైనా ప్రజల కోసం 45 ఏళ్లుగా టీడీపీ పోరాటం చేస్తూనే ఉందన్నారు. నరహంతకులు పీకలు కోస్తున్నా.. టీడీపీ కార్యకర్తలు తెలుగు దేశం జెండాను మాత్రం వదలకుండా అభిమానం చూపారన్నారు. చంద్రయ్య లాంటి కార్యకర్తను ప్రత్యర్థి పార్టీల వారు నరుకుతున్నా జై చంద్రబాబు, జై తెలుగుదేశం అంటూ నినదించి అమరుడయ్యారని గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తి కలకాలం నిలుస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో తనను కూడా అక్రమంగా జైల్లో పెట్టారని, లోకేష్ యువగళాన్ని అడ్డుకున్నారని, ఎంతోమంది పార్టీ నేతల్ని, కార్యకర్తలపై అన్యాయంగా కేసులు పెట్టి అరెస్టు చేశారని వివరించారు. బాధితుల్నే నిందితులుగా చేసినా ఏ టీడీపీ నాయకుడూ, కార్యకర్తా వెనకడుగు వేయలేదని కొనియాడారు. ప్రజాస్వామ్యాన్ని బతికించేందుకు 2024 ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో కలిసి కూటమిగా ఏర్పడ్డామని... ప్రజలు ఆదరించి, ఆశీర్వదించారని చెప్పారు.

మొన్నటి విజయంలో మహిళలదే కీలక పాత్ర

'మహిళా సాధికారిత కోసం, సామాజిక, ఆర్థిక రాజకీయ గౌరవం కోసం ప్రజా ప్రభుత్వం పనిచేస్తోంది. ఆస్తి హక్కు నుంచి నేడు తల్లికి వందనం వరకూ అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించటంతో పాటు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు సాధించే వరకూ టీడీపీ వారి వెనుక నిలబడుతుంది. విద్య, ఉద్యోగం, ఉపాధికి ఆర్థికంగా మహిళలకు వెసులుబాటు ఇచ్చేలా కార్యక్రమాలు చేపడుతున్నాం. స్త్రీ శక్తి ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. దీపం 2.0 పథకం ద్వారా ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలెండర్లు ఇస్తున్నాం. గత ఏడాది లక్ష మంది మహిళల్ని ఎంట్రప్రెన్యూర్‌లుగా తీర్చిదిద్దాం. మరో 5 లక్షల మంది మహిళల్ని ఎంట్రప్రెన్యూర్లుగా మార్చేలా కార్యాచరణ చేపట్టాం. స్వయం ఏపీ పేరుతో డ్వాక్రా మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పిస్తున్నాం.మొన్నటి విజయంలో మహిళలదే కీలక పాత్ర. ప్రజా క్షేత్రంలో పోరాడి పార్టీని గెలిపించారు. అందుకే ఈ మహానాడును ఆడబిడ్డలకు అంకితం చేసేలా మహిళా మహానాడుగా ప్రకటిస్తున్నాం.' అని ముఖ్యమంత్రి అన్నారు.

–యువతకు విస్తృత అవకాశాలు కల్పిస్తాం

యువత గురించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ.... 'ఏ పాలసీ చేసినా అది యువత కోసమే చేస్తున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ పాలసీతో యువతకు ఉద్యోగాలు వచ్చాయి. ఎన్నికల సమయంలో ప్రస్తుత టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ రాష్ట్రమంతటా పర్యటించి యువగళం పాదయాత్రలో హామీలు ఇచ్చారు. దానికి అనుగుణంగా జెన్ జీ, జెన్ ఆల్ఫా, టీనేజర్ల ఆలోచనలకు అనుగుణంగా విధానాలు రూపొందించి అవకాశాలు కల్పిస్తాం, సహకారం అందిస్తాం. ఏఐ, క్వాంటం, స్పేస్, ఏరోస్పేస్, ఆటోమొబైల్, సెమీ కండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ ఇలా అన్ని రంగాల్లో ఏపీ చిరునామాగా ఉంటుంది. 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి... తద్వారా 23 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చేందుకు వీలు కలిగింది. ఇప్పటికే రూ.11.27 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి 282 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ద్వారా ఆమోదం తెలిపాం. పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, రేర్ ఎర్త్ మినరల్స్ , 5 తరం ఫైటర్ జెట్ యుద్ధ విమాన ప్రాజక్టు కూడా రాష్ట్రానికి వస్తోంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కాదు గేర్ మార్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తున్నాం. కేవలం 36 రోజుల్లోనే ఫైటర్ జెట్ యుద్ధ విమాన తయారీ, టెస్టింగ్ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చాం. ఆ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తోనే తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ మోటారు సైకిల్ ప్రాజెక్టు వచ్చింది. ఇది ఇన్ స్పైరింగ్ టైమ్ అని జెన్ జీ, జెన్ ఆల్ఫా, టీనేజర్ వర్గానికి పిలుపునిస్తున్నాను. యువతకు ఉద్యోగాలుఉపాధి వంటి అంశాల్లో వారి కంటే ముందే ఆలోచన చేసి అందుకు అనుగుణంగా విధానాలు రూపొందిస్తున్నాం. ఆకాశమే హద్దుగా యువత రాష్ట్రంలోని అవకాశాలు వినియోగించుకోవాలి. నచ్చిన రంగాన్ని ఎంచుకుని వన్ ఎంట్రప్రెన్యూర్ వన్ ఫ్యామిలీ లక్ష్యం చేరుకోవాలి. మెగా డీఎస్సీ ద్వారా 15,941 మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిది. 5,757 మంది కానిస్టేబుళ్లను రిక్రూట్మెంట్ పూర్తి చేసిన ప్రభుత్వం మనది. 10 వేలకు పైగా పోస్టులతో 2026 జాబ్ కేలండర్‌ను కూడా విడుదల చేశాం.' అన్నారు.

సంక్షేమం- అభివృద్ధి- సుపరిపాలనకు అర్థం చెప్పాం

'రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత 23 నెలల్లో దాదాపు రూ.63వేల కోట్లకు పైగా మొత్తాన్ని సామాజిక భద్రతా పింఛన్ల కోసం ఖర్చు పెట్టాం. ఇది దేశంలోనే రికార్డు. మరోవైపు రైతన్నను అన్ని విధాలా ఆదుకున్నాం. గత పాలకులు రైతాంగాన్ని నిర్వీర్యం చేశారు. వారికి ఏడాదికి రూ.7,500 మాత్రమే సాయంగా ఇచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.14 వేలను ఏడాదికి అన్నదాత సుఖీభవ కింద ఇస్తున్నాం. కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆక్వా రైతులకు ఈ జూన్ మొదటి తేదీ నుంచి యూనిట్ విద్యుత్ రూ.1.50 ఇవ్వాలని ఆదేశించారు. మన తీరంలో మత్స్య సంపదపై మన మత్స్యకారులకే హక్కులున్నాయి. తీరం మనదే, బోటు మనదే, వేటా మనదే అనేలా చర్యలు చేపట్టాం. 200 మెకనైజ్డ్ బోట్లను మత్స్యకారులకు రూ.240 కోట్ల సబ్సీడీపై ఇవ్వాలని నిర్ణయించాం. దివ్యాంగ శక్తి పేరిట ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నాం. గీత, వడ్డెర కార్మికులకు మద్యం దుకాణాలు, గనుల్లో రిజర్వేషన్లు కల్పించాం. ప్రజారోగ్యంలో సంజీవని ప్రాజెక్టుతో వినూత్న మార్పు తీసుకువచ్చాం. ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో దీనిని అమలు చేస్తున్నాం. ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వ్యక్తిగత ఆరోగ్య పర్యవేక్షణ కోసం డిజిటల్ హెల్త్ రికార్డుల కార్యక్రమం 'సంజీవని' అమలు చేస్తాం. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా అందరికీ ఆరోగ్య బీమాను కల్పిస్తున్నాం. విద్యారంగంలో ఏపీని రోల్ మోడల్‌గా నిలుపుతున్నాం. పేరెంట్ టీచర్స్ మీటింగ్, పాఠ్యాంశాల్లో మార్పులు వంటివి చేపట్టాం. అలాగే రాష్ట్రంలో ఎంతో కీలకమైన సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి సంకల్పించాం. 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను ఎప్పటికల్లా పూర్తి చేయాలి, ఎప్పుడు పూర్తి చేయాలనేదానిపై క్యాలండర్ ప్రకటించాం. పోలవరం ప్రాజెక్టును పుష్కరాలకంటే ముందే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. గత పాలకుల నిర్లక్ష్యంతో డయాఫ్రమ్ వాల్ ధ్వంసమైంది. రూ. 1,000 కోట్లతో మళ్లీ నిర్మించాం. హంద్రీనీవా కాలువ వెడలు చేయడం ద్వారా కుప్పం వరకూ నీళ్లు తీసుకెళ్లాం. గత ప్రభుత్వం కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో సినిమా సెట్టింగులు వేసి ట్యాంకర్‌తో నీళ్లు ఇచ్చి రైతుల్ని మోసం చేసింది. వెలిగొండ ఫేజ్ వన్ కూడా పూర్తి చేసి మార్కాపురం జిల్లాను సస్యశ్యామలం చేస్తాం. రాష్ట్రంలో చెరువులు, రిజర్వాయర్లు జలకళతో కళకళ లాడుతున్నాయి. జలధారజలహారతి ద్వారా భూగర్భజలాలను పెంచేలా వంద రోజుల కార్యక్రమం నిర్వహిస్తున్నాం.' అని ముఖ్యమంత్రి చెప్పారు.

క్రమశిక్షణ, కమిట్మెంట్‌తో కష్టపడే క్యాడర్

'దేశంలో ఏ పార్టీకి లేని బలమైన కేడర్ మనకు ఉంది. క్రమశిక్షణ, కమిట్మెంట్‌తో కష్టపడే క్యాడర్ టీడీపీ సొంతం. మన బలం బలగం కేడర్. ఏదైనా పార్టీ ఫస్ట్, క్యాడర్ బెస్ట్. నాయకులను తయారు చేసే విశ్వవిద్యాలయం తెలుగు దేశం పార్టీ. ఇక్కడ చదువుకున్న, శిక్షణ పొందిన నాయకులే అన్ని చోట్లా రాణిస్తున్నారు. సోషల్ రీ ఇంజినీరింగ్ చేయటమే పార్టీ విధానం. అందరికీ అవకాశాలు కల్పించటమే పార్టీ లక్ష్యం. కార్యకర్తల సంక్షేమం కోసం రూ.160 కోట్లు ఖర్చు చేశాం. ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్ కోసం కూడా ఆదుకునేలా పార్టీ చర్యలు తీసుకుంటోంది. మై హెల్త్ యాప్ ద్వారా కార్యకర్తలు, వారి కుటుంబం ఆరోగ్యం కాపాడే బాధ్యత పార్టీ తీసుకుంది. ఎథికల్, ఎకనామికల్, ఎంపవర్‌మెంట్ నినాదంతో ముందుకు వెళ్తున్నాం. పార్టీ అధినేతగా నా పార్టీ కుటుంబ సభ్యులైన కార్యకర్తల ఎంపవర్మెంట్ కోసం నిరంతరం పనిచేస్తాం. స్థానిక ఎన్నికల కోసం సిద్ధం కావాలని అందరికీ పిలుపిస్తున్నా. ఏ ఎన్నికలైనా గెలుపే ప్రజాభిప్రాయానికి కొలమానం. గెలుపే ధ్యేయంగా నేతలు, కార్యకర్తలు పనిచేయాలి, ప్రజా సమస్యలు పరిష్కారం చేస్తూ ముందుకుసాగాలి. మనం చేసిన పని ప్రజలకు తెలియచేస్తూ వారిని ఆకట్టుకోవాలి. ఓటు నమోదు చేయించే కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలి. 'సర్'లో భాగంగా ఓట్ల నమోదు విషయంలో లీడర్లు, కేడర్ జాగ్రత్తగా ఉండాలి. మిత్ర పక్షాలతో సఖ్యతగా, సమన్వయంతో ముందుకు వెళ్దాం. 2024 ఎన్నికల్లో సాధించిన విజయం మళ్లీ రిపీట్ అయ్యేలా అందరం మమేకం అవుదాం. ఎవరూ ఇగోలకు వెళ్లొద్దని హితవు పలుకుతున్నాను. ప్రతీ నేతా జనంతో కార్యకర్తలతో మమేకం కావాలి. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ మన లక్ష్యం. మహానాడు సాక్షిగా తెలుగు జాతి కోసం పునరంకితం అవుదామని అందరికీ పిలుపునిస్తున్నాను. వచ్చిన అవకాశాలను నిలబెట్టుకోవాలని అందరికీ తెలియచేస్తున్నాను.' అని ముఖ్యమంత్రి తన ప్రసంగంలో స్పష్టం చేశారు.

తోటివారికి ఓ గ్లాసు నీళ్లివ్వండి

ఈకబురు,దిల్లీ: ఎండలతో అత్యంత అప్రమత్తంగా ఉండాలని దేశ ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచించారు. ఈ కఠిన వాతావరణంలో గరిష్ఠ జాగ్రత్తలు ఆవశ్యకమని పేర్కొన్నారు. దేశంలో ఎండలు మండిపోతున్న నేపథ్యంలో బుధవారం ఆయన ఎక్స్ వేదికగా ప్రజలకు పలు సూచనలు చేశారు. 'దేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. ఈ తీవ్ర ఎండలవల్ల పిల్లలు, పెద్దవారు, బహిరంగ ప్రదేశాల్లో పని చేస్తున్నవారు వెంటనే ప్రభావితమయ్యే అవకాశముంది. వేడివల్ల వచ్చే అలసట త్వరగా ప్రమాదకరంగా మారుతుంది. అది వడదెబ్బకు దారి తీస్తుంది. అందువల్ల అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి' అని ప్రధాని సూచించారు. ప్రతి ఒక్కరూ నీరు తాగుతూ ఉండాలి. బయటకు వెళ్లేటప్పుడు తాగునీరు తీసుకెళ్లాలి. తోటివారికి ఓ గ్లాస్ తాగునీరు ఆఫర్ చేయాలి.

తల తిరగడం, వికారం, తీవ్రమైన అలసట వంటి వడదెబ్బ లక్షణాలను గమనిస్తూ ఉండాలి. ఎవరైనా అలసటగా, తలనొప్పితో ఉంటే వెంటనే వారిని చల్లని ప్రదేశానికి తరలించండి. వెంటనే తాగు నీరు, ఓఆర్ఎస్ వంటివి అందించండి.

వృద్ధ తల్లిదండ్రులను, తాత, అమ్మమ్మ, నాన్నమ్మలను గమనిస్తూ ఉండండి. తాగునీరు తీసుకుంటూ ఉండాలని వారికి చెప్పండి. మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లనీయకండి. అవసరమైనంత సమయం విశ్రాంతి తీసుకోవాలని సూచించండి.

విజయన్ ఇంట్లో ఈడీ సోదాలు.. రాజకీయ దాడే!

ఈకబురు,హైదరాబాద్: 'ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తికాగానే కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల్ని రాజకీయంగా బలహీనపరిచే ప్రయత్నాల్ని వేగవంతం చేసింది. ప్రశ్నించే వ్యక్తులే లక్ష్యంగా కేంద్ర దర్యాప్తు సంస్థల్ని దుర్వినియోగం చేస్తోంది' అని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, విజయ రాఘవన్ ఆరోపించారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి విజయన్ ఇంట్లో ఈడీ సోదాలు రాజకీయ దాడేనని మండిపడ్డారు. హైదరాబాద్ ఎంబీభవన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..''కేంద్రంలో మోదీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైంది. సీపీఎం నీతిమంతమైన పార్టీ. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి సీపీఎం నేతలపై ఒక్క కేసు కూడా లేదు. తరచూ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో ప్రజలపై తీవ్రభారం పడుతోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో ఆయిల్ నిల్వలను తగినంత ఉంచడంలో కేంద్రం విఫలమైంది'' అని విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని, బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

వ్యోమగాములకు చంద్ర వాహనం

ఈకబురు,వాషింగ్టన్: చందమామపై మానవుడు అడుగుపెట్టి దశాబ్దాలు గడిచిపోయాయి. ఎన్నో దేశాలు రోవర్లను పంపించాయి. ఆ ఉపగ్రహం రహస్యాలు ఛేదించడానికి నిరంతరం పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. చంద్రుడి ఉపరితలంపై వ్యోమగాముల కోసం శాశ్వత ఆవాసం నిర్మించాలని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా'నిర్ణయించింది. ఇందుకోసం ఒక రోడ్‌మ్యాప్ సిద్ధం చేసింది. చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద మానవుల నివాసానికి అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని గుర్తించారు. ఎందుకంటే అక్కడ దాదాపు నిరంతరంగా సూర్యరశ్మి లభిస్తుంది. మంచు రూపంలో నీటి నిల్వలు ఉన్నాయి. మనుషులు అక్కడే దీర్ఘకాలం ఉంటూ తమ పరిశోధనలు సాగించవచ్చు. తొలుత చందమామపై స్థావరాలు ఏర్పాటు చేసుకొని, అక్కడి నుంచి భవిష్యత్తులో అంగారక గ్రహానికి మానవ సహిత యాత్రలు చేయాలన్నది నాసా ప్రణాళిక. కఠినమైన రాళ్లు రప్పలు, దుమ్ముధూళి, తీవ్రమైన వేడి, చలితో కూడిన చంద్రుడి ఉపరితలంపై తిరగడం అనుకున్నంత సులభం కాదు. ఒకటి ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ప్రయాణించాల్సి ఉంటుంది. బరువైన యంత్రాలు, సామగ్రిని కూడా మోసుకెళ్లాలి. ఈ సమస్య పరిష్కారంపై నాసా దృష్టి పెట్టింది. లూనార్ టెరైన్ వెహికల్ సర్వీసెస్(ఎల్‌టీవీఎస్) కార్యక్రమంలో భాగంగా మానవ సహిత రోవర్లను నిర్మించడానికి కాలిఫోర్నియాకు చెందిన ఆస్ట్రోలాబ్ సంస్థను ఎంపిక చేసింది. చందమామపై వ్యోమగాములు సులభంగా తిరగడానికి వీలుగా వాహనాలు తయారు చేసి ఇవ్వాలని సూచించింది. ఈ కాంట్రాక్ట్ విలువ 219 మిలియన్ డాలర్లు. చంద్రుడి ఉపరితలంపై ప్రయాణించడానికి 'సీఎల్‌వీ-1'వాహనాన్ని ఆస్ట్రోలాబ్ సంస్థ నిర్మించి 2028 నాటికి నాసాకు అందజేసే అవకాశం ఉంది.

ఆస్ట్రోల్యాబ్ మొదట్లో ఫ్లెక్స్ అనే రోవర్‌ను తయారు చేసింది. ఇది సరుకు రవాణా, శాస్త్రీయ పరిశోధనలు, సాధారణ పనుల కోసం తోడ్పడుతుంది. కానీ, ఇది తమ అవసరాలకు సరిపోదని సానా తేల్చిచెప్పింది. అందుకే ఫ్లెక్స్ రోవర్‌లో భారీ మార్పులు చేశారు. సీఎల్‌వీ-1గా డిజైన్ చేశారు. ఇది కేవలం సామగ్రి రవాణా చేయడానికి కాకుండా.. ప్రధానంగా సూట్లు ధరించిన ఇద్దరు వ్యోమగాములను, వారి పరికరాలను రవాణా చేయడానికి వీలుగా మార్చారు. చంద్రుడి ఉపరితలంపై శాశ్వత స్థావరం నిర్మాణానికి, సిబ్బందిని ఒకచోటు నుంచి మరో చోటుకు చేరవేయడానికి సీఎల్‌వీ-1 చక్కగా తోడ్పడుతుందని నాసా అధికారులు వెల్లడించారు. ఈ వాహనం చిత్రాలను తాజాగా నాసా విడుదల చేసింది. ఇది నాలుగు చక్రాలతో కూడిన కారులాంటి వాహనం. స్పేస్ సూట్లు ధరించిన ఇద్దరు వ్యోమగాములు సులభంగా ఎక్కడానికి, దిగడానికి అనుకూలంగా డిజైన్ రూపొందించారు. గాలి లేని టైర్లు ఉంటాయి. చందమామపై వదులుగా ఉన్న నేలపై ఇవి బలమైన పట్టును అందిస్తాయి. కొంత వాలుగా ఉన్న ప్రాంతాలను, రాతి అడ్డంకులను అధిగమించడంలో సహాయపడతాయి. ఆస్ట్రోలాబ్ సంస్థ వెంటూరీ స్పేస్ అనే సంస్థతో కలిసి ఈ చంద్ర వాహనాలను అభివృద్ధి చేస్తోంది. అపోలో లూనార్ రోవింగ్ వెహికల్‌ను స్ఫూర్తిగా తీసుకొని మొదట రోవర్‌ను తయారుచేశారు. కానీ, ఆధునిక అవసరాలకు తగ్గట్టుగా మరింత సమర్థవంతంగా పనిచేసేలా మార్పులు చేశారు. సీఎల్‌వీ-1 సమతల భాగంపై గంటకు 9 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించగలదు. నిటారైన వాలులను అధిగమించగల సామర్థ్యం కలిగి ఉంది. ఇది వ్యోమగాములు చందమామ ఉపరితలంపై ఇంతకుముందు చేరుకోలేని లోతైన బిలాలను, నీడ ఉన్న ప్రాంతాలను, శాస్త్రీయంగా ఆసక్తికరమైన ప్రదేశాలను అన్వేషించడానికి వీలు కల్పిస్తుంది. చంద్రుడిపై శాశ్వత నివాసం,

ఆన్‌లైన్ గేమ్స్ పై రాష్ట్రాలూ నిషేధం విధించొచ్చు

కర్ణాటక, తమిళనాడు నిర్ణయాలకు సుప్రీంకోర్టు సమర్థన

రాష్ట్రాలకు, ప్రజల జీవితాలకు ఇబ్బంది కలిగించే పక్షంలో నైపుణ్యంతో కూడుకున్న గేమ్స్ సహా వివిధ రకాల ఆన్‌లైన్ గేమ్‌స్‌పై రాష్ట్రాలు నిషేధం విధించొచ్చని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అటువంటి సందర్భాల్లో ఆయా గేమ్‌స్‌ను నియంత్రించడంలో రాష్ట్రాలు నిస్సహాయంగా ఉండకూడదని స్పష్టం చేసింది. తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలు ఆన్‌లైన్ గేమ్‌స్‌పై విధించిన నిషేధాన్ని న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ధర్మాసనం సమర్థించింది. నైపుణ్యం ఉన్న వాణిజ్య గేమ్‌స్‌కు భారత రాజ్యాంగం నుంచి రక్షణ ఉంది. అయితే వాటిని పందెం కాయడానికి, పణంగా పెట్టడానికి ఉపయోగిస్తే చట్టబద్ధ మినహాయింపు ఉంటే తప్ప వాటికి ఎటువంటి రక్షణ లభించబోదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలపై 28% జీఎస్‌టీకీ సమర్థన: ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలపై వెనకటి తేదీ నుంచి అమల్లోకి వచ్చేలా (రెట్రోస్పెక్టివ్) 28% జీఎస్‌టీ విధించడానికి రాజ్యాంగబద్ధత ఉందని సుప్రీంకోర్టు సమర్థించింది. ఫాంటసీ స్పోర్ట్స్, పూల్ స్టేక్స్ వంటి ఆన్‌లైన్ గేమింగ్ కార్యకలాపాలు సీజీఎస్‌టీ చట్టం2017 కిందకు వస్తాయని కోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వం విధించిన రెట్రోస్పెక్టివ్ పన్నును సవాలు చేస్తూ డెల్టా కార్ప్, గేమ్‌స్‌క్రాఫ్ట్ టెక్నాలజీస్, తదితర కంపెనీలు దాఖలు చేసిన పిటిషన్లను అత్యున్నత న్యాయ స్థానం కొట్టిపారేసింది. ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్‌టీ ఇంటెలిజెన్స్ విధించిన దాదాపు రూ.1.12 లక్షల కోట్ల షోకాజ్ నోటీసులకు సంబంధించిన ప్రొసీడింగ్‌స్‌పై స్టేను సైతం ఎత్తివేసింది. అలాగే గేమ్‌స్‌క్రాఫ్ట్‌కు జారీ చేసిన రూ.21,000 కోట్ల షోకాజ్ నోటీసును కొట్టేస్తూ కర్ణాటక హైకోర్టు జారీ చేసిన ఆదేశాలనూ పక్కనపెట్టింది.

అయిదో తరం యుద్ధ విమానాల తయారీ రేసులో టాటా, ఎల్ అండ్ టీ, భారత్ ఫోర్జ్

ప్రక్రియకు దూరంగా హెచ్‌ఏఎల్

మనదేశం సొంతంగా అయిదో తరం యుద్ధ విమానాలను తయారు చేసేందుకు చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమం కీలక దశకు చేరుకుంది. అధునాతన మధ్య తరహా యుద్ధ విమానం (ఏఎమ్‌సీఏ) ప్రాజెక్టుకు రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్‌ఎఫ్‌పీ)ను 3 కంపెనీలకు రక్షణ శాఖ జారీ చేసింది. అందులో ఎల్ అండ్ టీ, టాటా అడ్వాన్‌స్‌డ్ సిస్టమ్స్, భారత్ ఫోర్జ్ ఉన్నట్లు తెలుస్తోంది. ఎల్ అండ్ టీ ఇందు కోసం భారత్ ఎలక్ట్రానిక్‌స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకోగా, బీఈఎంఎల్‌తో భారత్ ఫోర్జ్ జట్టు కట్టింది. పోటీ పద్ధతిలో ప్రైవేటు, ప్రభుత్వ రంగాలకు సమాన అవకాశాలను ఇచ్చే ఆచరణాత్మక విధానాన్ని ఇందుకు వినియోగిస్తున్నారు. అయితే ప్రభుత్వరంగ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ (హెచ్‌ఏఎల్)ను ఈ ప్రక్రియకు దూరంగా పెట్టడం గమనార్హం.

ఏమిటీ ఏఎమ్‌సీఏ ప్రోగ్రామ్: మన దేశానికి ఇది అత్యంత ప్రతిష్టాత్మక యుద్ధ విమాన ప్రాజెక్టు. భారత వైమానిక దళ పోరాట సామర్థ్యానికి 2030 మధ్య నుంచి ఇది వెన్నెముకగా నిలుస్తుందని అంచనా. రెండు ఇంజిన్లతో డిజైన్ చేసిన ఈ స్టెల్త్ ఫైటర్ జెట్‌లో అధునాతన సెన్సర్ ఫ్యూజన్, ఆయుధ నిల్వకు ఉపకరించే చోటు, ఏఐ (కృత్రిమమేధ) ఆధారిత వ్యవస్థలు, నెట్‌వర్క్ కేంద్రీకృత యుద్ధ సామర్థ్యం తదితరాలున్నాయి.

ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌లో: శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తిలో 650 ఎకరాల్లో ఏఎమ్‌సీఏ ప్రాజెక్టు నిర్మాణానికి ఈ నెల 15న రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంతి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. రూ.15,803 కోట్ల భారీ వ్యయంతో దీనిని చేపట్టనున్నారు. భారత రక్షణ రంగ చరిత్రలో ఇది చరిత్రాత్మక అధ్యాయమని రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు.

ఎంపిక సమయం:

ఈ మూడు కంపెనీలు స్పందనలను సమర్పించిన అనంతరం, 45 నెలల్లో ఎంపిక ప్రక్రియ పూర్తవుతుంది. ఎంపిక చేసిన కంపెనీ ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీతో కలిసి పనిచేయాల్సి ఉంటుంది. ప్రాజెక్టు కింద 5 అధునాతన మధ్య స్థాయి యుద్ధ విమానాల ప్రొటోటైపులను సిద్ధం చేయాల్సి ఉంటుంది.

భారీగా తగ్గనున్న ఖర్చు: 2019 లో 114 విమానాలకు రూ.1.26 లక్షల కోట్లతో టెండర్ జారీ చేశారు. దేశీయంగా యుద్ధ విమానాల తయారీ వల్ల భారీగా పొదుపు చేయొచ్చు. జీఈ ఎఫ్414 ఇంజిన్‌తో తొలి ప్రొటోటైపును 2029 కల్లా తీసుకురావచ్చని అంచనా. కాంట్రాక్టు సంతకం తేదీ అనంతరం 30 నెలల్లోగా తొలి విమానం సిద్ధం కావాలి.తప్పనిసరిగా 1800 సార్టీ ఫ్లైట్ టెస్ట్ ప్రోగ్రామ్‌ను సంతకాలు జరిగిన 84 నెలల్లోగా పూర్తి చేయాలి. ఆ తర్వాతే భారీ ఉత్పత్తికి వెళ్లాలి.

రెండో రోజు స్వల్ప నష్టాలు

రూ.2.04 లక్షల కోట్లు పెరిగిన సంపద విలువ

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.1,042.70 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు: రూ.3,821.00 కోట్లు

పశ్చిమాసియా ఉద్రిక్తతల ఉపశమనానికి సంబంధించి వస్తున్న పరస్పర విరుద్ధ వార్తలు మదుపర్లను గందరగోళానికి గురిచేస్తున్నాయి. దీంతోపాటు మన స్టాక్ మార్కెట్ నుంచి విదేశీ పెట్టుబడిదార్లు నిధులు ఉపసంహరించడం వల్ల వరుసగా రెండో రోజైన బుధవారమూ సూచీలు నష్టాల్లో ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 12 పైసలు పెరిగి 95.58 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 3.24% తగ్గి 96.35 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్ సానుకూలంగా ముగిశాయి. షాంఘై, హాంకాంగ్ సూచీలు నష్టపోయాయి. ఐరోపా మార్కెట్లు సానుకూలంగా కదలాడాయి. సూచీలు నష్టపోయినా, బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.04 లక్షల కోట్లు పెరిగి, రూ.470.75 లక్షల కోట్ల (4.91 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 75,939.86 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,009.70 పాయింట్లు) ప్రతికూలంగా ప్రారంభమైంది. తర్వాత లాభాల్లోకి వచ్చిన సూచీ ఒక దశలో 76,224.68 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. మళ్లీ నష్టాల్లోకి జారుకుని 75,748.21 పాయింట్ల వద్ద కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. చివరకు 141.90 పాయింట్లు కోల్పోయి 75,867.80 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సూచీ 6.55 పాయింట్లు నష్టపోయి 23,907.15 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 23,983.20 23,858.25 పాయింట్ల మధ్య కదలాడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 10 నష్టపోయాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.63%, ఇన్ఫోసిస్ 0.71%, ఐటీసీ 0.61%, హెచ్‌యూఎల్ 0.53% చొప్పున పడ్డాయి. పవర్‌గ్రిడ్ 2.56%, ఎటర్నల్ 2.54%, ఎన్‌టీపీసీ 2.23%, టాటా స్టీల్ 2.04%, ఇండిగో 1.9%, మారుతీ 1.22% లాభపడ్డాయి. రంగాల వారీ సూచీలకొస్తే టాప్ 10 బ్యాంక్స్, ప్రైవేట్ బ్యాంక్స్, ఆర్థిక సేవలు, బ్యాంకెక్స్, ఫోకస్డ్ ఐటీ, ఐటీ రంగాలు రాణించాయి. భారీ యంత్ర పరికరాలు, యుటిలిటీస్, విద్యుత్, లోహ, వాహన, టెలికాం రంగాలు డీలాపడ్డాయి. బీఎస్‌ఈలో 2,220 షేర్లు సానుకూలంగా, 1,996 షేర్లు ప్రతికూలంగా కదలాడాయి. 178 షేర్లలో మార్పు లేదు.

--ఇన్ఫోసిస్‌ను అధిగమించిన అదానీ పవర్

గౌతమ్ అదానీకి చెందిన అదానీ పవర్ మార్కెట్ విలువ రూ.4.79 లక్షల కోట్లకు చేరింది. దీంతో దేశీయంగా అత్యధిక మార్కెట్ విలువ కలిగిన కంపెనీల జాబితాలో 11వ స్థానానికి చేరింది. ఐటీ దిగ్గజ కంపెనీ ఇన్ఫోసిస్ మార్కెట్ విలువ (రూ.4.70 లక్షల కోట్ల)ను అదానీ పవర్ మించడం గమనార్హం.

ఈ ఏడాది ఇప్పటి వరకు అదానీ పవర్ మార్కెట్ విలువ 68% వృద్ధి చెందింది. షేరు ధర బుధవారం బీఎస్‌ఈలో 1.72% లాభపడి రూ.248.75 వద్ద ముగిసింది. ఫలితంగా సంస్థ మార్కెట్ విలువ రూ.4.79 లక్షల కోట్లకు చేరింది. అదానీ గ్రూప్‌లోని మిగతా కంపెనీల షేర్లు కూడా పెరిగాయి. అదానీ టోటల్ గ్యాస్ 13.35%, ఎన్‌డీటీవీ 10.39%, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 5.28%, అంబుజా సిమెంట్స్ 2.28%, అదానీ గ్రీన్ ఎనర్జీ 2.23%, ఏసీసీ 1.09%, అదానీ పోర్ట్స్ 0.74%, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 0.11% లాభపడ్డాయి. ఈ సంస్థల సంయుక్త మార్కెట్ విలువ రూ.19.44 లక్షల కోట్లకు చేరింది.

--నేడు మార్కెట్లకు సెలవు: బక్రీద్

సందర్భంగా గురువారం మన స్టాక్ మార్కెట్లు, ఫారెక్స్ మార్కెట్లు పని చేయవు. కమొడిటీ మార్కెట్లు సాయంత్రం 5 గంటల నుంచి పని చేస్తాయి.

వికసిత్ భారత్ లక్ష్యానికి బ్యాంకింగ్ రంగమే కీలకం

ఎస్‌బీఐ ఛైర్మన్ సి.శ్రీనివాసులు శెట్టి

దిల్లీ: 'వికసిత్ భారత్' లక్ష్యం దిశగా మన దేశం అడుగులు వేస్తున్న తరుణంలో, పెట్టుబడుల సమీకరణ, పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వడం, ఆర్థిక సమగ్రతను ముందుకు తీసుకువెళ్లడంలో బ్యాంకింగ్ రంగం కీలక పాత్ర పోషిస్తోందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఛైర్మన్ సి.శ్రీనివాసులు శెట్టి అభిప్రాయపడ్డారు. దేశంలోనే అతిపెద్ద బ్యాంక్‌గా, ఈ ప్రగతి ప్రయాణంలో తమకు లభించిన అవకాశం, బాధ్యతలను గుర్తిస్తూ.. దేశ ఆర్థిక వృద్ధి లక్ష్యాలకు మద్దతు ఇవ్వడానికి ఎస్‌బీఐ కట్టుబడి ఉందన్నారు. రాబోయే రోజుల్లో 'డిజిటల్ ఫస్ట్, కస్టమర్ ఫస్ట్' వ్యూహాన్ని బలోపేతం చేయడంపై బ్యాంక్ దృష్టి పెట్టిందన్నారు. మెరుగైన బ్యాంకింగ్ వ్యవస్థల కోసం టెక్నాలజీ, డేటా అనలిటిక్స్, కృత్రిమ మేధ, సైబర్ భద్రత, డిజిటల్ మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. డిజిటల్ సేవలు వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, ఎస్‌బీఐ రిలేషన్‌షిప్ మోడల్‌లో భౌతిక బ్యాంకింగ్ ఎప్పటికీ కీలకంగా కొనసాగుతుంది. శాఖల నెట్‌వర్క్ నమ్మకాన్ని, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల వేగం, సౌకర్యంతో అనుసంధానించడం ద్వారా ఖాతాదారులకు అసలైన 'ఓమ్ని ఛానల్' బ్యాంకింగ్ అనుభవాన్ని అందించడమే ఎస్‌బీఐ లక్ష్యమని శెట్టి తెలిపారు.

ప్రాజెక్ట్ సరళ్, ఆటోమేషన్‌పై దృష్టి: బ్యాంకింగ్ ప్రక్రియలను మరింత సరళీకృతం చేయడానికి, రుణాల ప్రాసెసింగ్, సేవల సమయాన్ని మెరుగుపరచడానికి ప్రాజెక్ట్ సరళ్ కింద చేపట్టిన కార్యక్రమాలను బ్యాంకింగ్ కొనసాగించనుంది. దీని కింద ప్రాసెస్ రీఇంజినీరింగ్, ప్రామాణీకరణ, డిజిటల్ ఇంటిగ్రేషన్, ఆటోమేషన్/కృత్రిమ మేధల వినియోగాన్ని మరింత పెంచనున్నారు. ఆన్‌లైన్‌లో ఖాతాలను తెరవడం, లావాదేవీల బ్యాంకింగ్, ఎస్ఎంఈ వ్యవస్థలను విస్తరించడం ద్వారా తక్కువ ఖర్చుతో, స్థిరమైన డిపాజిట్ బేస్‌ను నిర్మించడంపై బ్యాంక్ దృష్టి పెట్టనుంది. సంపద నిర్వహణ విభాగాన్ని బలోపేతం చేయడానికి, సాంకేతికత ఆధారిత రిలేషన్‌షిప్ అడ్వైజరీ సేవలను విస్తరించడానికి మార్కెట్‌లో భారీ అవకాశాలు ఉన్నాయని శెట్టి పేర్కొన్నారు. భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న (ఫ్యూచర్ రెడీ) సంస్థను నిర్మించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ ప్రయాణంలో ఉద్యోగులు కీలకంగా ఉంటారని, రిస్క్ మేనేజ్‌మెంట్, పరిపాలన వంటివి బ్యాంక్ వృద్ధి వ్యూహానికి పునాదులుగా ఉంటాయన్నారు.

విమాన సర్వీసులు తగ్గుతున్నాయ్

ప్రకటించిన ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో

ఇంధన ధరల భారమే కారణం

దేశీయ మార్గాల్లో విమాన సర్వీసుల సంఖ్య తాత్కాలికంగా తగ్గనుంది. రాబోయే వారాల్లో సర్వీసుల సంఖ్యలో 10-22% కోత విధిస్తున్నట్లు ఎయిరిండియా - ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో సంస్థలు ప్రకటించాయి. వేసవి సెలవులు ముగిసి, గిరాకీ తగ్గడానికి తోడు, విమాన ఇంధన (ఏటీఎఫ్) ధర పెరగడం ఇందుకు కారణంగా సంస్థలు పేర్కొన్నాయి.

ఎయిరిండియా.. జూన్ - జులై నెలలకు తమ దేశీయ విమాన సర్వీసుల్లో 20-22% కోత విధించింది. వివిధ దేశాలు తమ గగనతలంపై ఆంక్షలు విధించడానికి తోడు, ఏటీఎఫ్ ధర పెరుగుదలను కారణంగా చూపుతూ, అంతర్జాతీయ సర్వీసుల్లో 27% కోత విధిస్తున్నట్లు ఈనెల 13న ఎయిరిండియా ప్రకటించింది. ఇప్పుడు దేశీయ విమాన సర్వీసులనూ తగ్గించుకుంటోంది. ప్రస్తుతం వారానికి 4,400 విమాన సర్వీసులను ఎయిరిండియా నడుపుతోంది. ఇందులో 3,600 దేశీయ, 800 అంతర్జాతీయ సర్వీసులు ఉన్నాయి.

3,600 దేశీయ విమాన సర్వీసుల్లో 22% అంటే వారానికి 800 వరకు విమాన సర్వీసులు రద్దు కానున్నాయి. '2026 జూన్-ఆగస్టు మధ్య అంతర్జాతీయ సర్వీసుల్లో కొన్ని మార్పులను ఇప్పటికే ప్రకటించాం. ఇందుకు కొనసాగింపుగా దేశీయ మార్గాల్లో సర్వీసులను తాత్కాలికంగా కుదించామ'ని ఎయిరిండియా ప్రకటించింది. ఏటీఎఫ్ ధరలు స్థిరపడ్డాక ఈ సర్వీసులను మళ్లీ పునరుద్ధరిస్తామని కంపెనీ పేర్కొంది.

ప్రయాణికులకు ప్రత్యామ్నాయాలు: దేశీయ మార్గాల్లో విమాన సర్వీసుల రద్దు వల్ల ఇబ్బంది పడే ప్రయాణికులకు, ప్రత్యామ్నాయ విమానాల్లో టికెట్లు, ఉచితంగా ప్రయాణ తేదీ మార్చుకునే అవకాశం కల్పిస్తామని లేదా టికెట్ డబ్బును పూర్తిగా రిఫండ్ చేస్తామని ఎయిరిండియా తెలిపింది.

ఇండిగో

దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో, సెప్టెంబరు త్రైమాసికానికి 12-15% దేశీయ సర్వీసులను తగ్గించనుంది. ప్రస్తుతం ఈ కంపెనీ వారానికి 15,400 విమాన సర్వీసులు నడుపుతోంది. ఇందులో 13,000 దేశీయ సర్వీసులే ఉన్నాయి. 15% కోత వల్ల వారానికి దాదాపు 2,000 విమాన సర్వీసులు తగ్గనున్నాయి. ప్రతి సంవత్సరం

ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్..

జూన్ మధ్య నుంచి ఆగస్టు వరకు డిమాండ్ తగ్గడం వల్ల చేసే సీజనల్ మార్పుల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇండిగో తెలిపింది.

జూన్‌లో 10% సర్వీసులను రద్దు చేయనుంది. సంస్థ వారానికి నడిపే 3,000 విమాన సర్వీసుల్లో.. దాదాపు 2,400 దేశీయ సర్వీసులే ఉన్నాయి. 10% కోత అంటే దాదాపు 240 విమాన సర్వీసులు రద్దు కానున్నాయి.

ఛార్జీలు ఇంకా పెరుగుతాయా?

వేసవి సెలవులు ముగిసి, విద్యాసంస్థలు ప్రారంభమయ్యే జూన్‌లోనూ విమాన టికెట్లకు గిరాకీ ఉంటుంది. ఏటీఎఫ్ ధరల వల్ల, ఇప్పటికే విమాన టికెట్ల ధరలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పుడు సర్వీసులు తగ్గుతున్నందున, సంబంధిత మార్గాల్లో నడుస్తున్న విమానాల్లోల టికెట్ల ధరలు ఇంకా పెరుగుతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే కంపెనీలు మాత్రం గిరాకీ తగ్గుతుంది కనుకే, సర్వీసుల్లో కోత విధిస్తున్నట్లు తెలపడం గమనార్హం.

రైతన్నలకు అండగా నిలవాలి

ఈ-కబురు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా.. వ్యవసాయ మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి, మొక్కజొన్న తదితర పంటలు తీవ్రంగా దెబ్బతినడం అత్యంత బాధాకరమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆపత్కాలంలో రైతన్నలకు అండగా నిలవాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. 'అకాల వర్షాలకు వడ్లు వర్షానికి కొట్టుకుపోతుంటే.. రైతన్నలు కన్నీరుమున్నీరవుతున్నారు. కరెంటు లేక సెల్‌ఫోన్ల వెలుతురులో రైతులు ధాన్యాన్ని కాపాడుకోవడానికి పడుతున్న అవస్థలు.. ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న తీవ్ర జాప్యం వల్లే నేడు రైతన్నలు ఈ దుస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ కష్టకాలంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉంది. మార్కెట్ యార్డుల్లో తడిసిన వరి, మొక్కజొన్న తదితర ధాన్యాన్ని తేమ శాతం, తరుగు లాంటి సాకులు చెప్పకుండా భేషరతుగా కనీస మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. రైతాంగానికి అండగా నిలిచేందుకు భారాస శ్రేణులు క్షేత్రస్థాయిలోకి వెళ్లాలి. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా.. రైతులకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి పెంచాలి' అని కేటీఆర్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

నాయికా ప్రాధాన్య చిత్రంలో మమిత

'ప్రేమలు' సినిమాతో యువతరాన్ని తన ప్రేమ మాయలో పడేసింది మమితా బైజు. త్వరలో ఆమె 'విశ్వనాథ్ అండ్ సన్స్', 'జన నాయగన్' లాంటి భారీ చిత్రాలతో అలరించేందుకు సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే ఇప్పుడామె తన తొలి నాయికా ప్రాధాన్య చిత్రాన్ని పట్టాలెక్కించినట్లు సమాచారం. 'లవ్‌టుడే', 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' సినిమాలతో ప్రేక్షకుల్ని మెప్పించిన యువ హీరో ప్రదీప్ రంగనాథన్ ఈ చిత్రంతో నిర్మాతగా మారుతున్నట్లు తెలిసింది. ఆయన వద్ద సహాయ దర్శకుడిగా పని చేసిన కుర్రాడు దీనికి దర్శకత్వం వహించనుండగా.. దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా ఇటీవలే చెన్నైలో లాంఛనంగా మొదలైందని.. త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని సమాచారం.

ఆ మాట చెప్పడానికి నేను భయపడను: దిల్ రాజు

ప్రస్తుతం ఇండస్ట్రీ చాలా క్లిష్టపరిస్థితుల్లో ఉందని నిర్మాత దిల్ రాజు తెలిపారు. తాను ఈ మాట చెప్పడానికి భయపడనన్నారు. 'సమ్మర్ హాలీడేస్' సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కు దిల్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్త వాళ్లతో సినిమా చేస్తే విజయం వస్తుందని తాను నమ్ముతానంటూ.. సమ్మర్ హాలీడేస్ మంచి హిట్ కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇండస్ట్రీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు.''ఇండస్ట్రీ ప్రస్తుతం చాలా కష్టకాలంలో ఉందని చెప్పడానికి చాలా మంది భయపడతారు. నేను ఈ విషయాన్ని ధైర్యంగా చెప్పగలను. ప్రేక్షకులను థియేటర్‌లకు తీసుకురావడమే మనందరికీ ఇప్పుడు సవాల్. సమ్మర్ హాలీడేస్ లాంటి సినిమాలు తీసి ఆడియన్స్‌ను థియేటర్‌కు తీసుకురండి. అప్పుడు ఆటోమేటిక్‌గా మంచి సినిమాలు నిలబడతాయి. చిన్న సినిమాలతో డైరెక్టర్లు అందరూ మంచి పేరు తెచ్చుకుంటున్నారు. కొత్త దర్శకులందరూ మంచి చిత్రాలు తీసి ఇండస్ట్రీని నిలబెట్టండి. చిన్న సినిమాలు ఎంత విజయం సాధిస్తే ఇండస్ట్రీ అంత బాగుంటుంది'' అని అన్నారు.''చాలా రోజుల తర్వాత ఒక ఈవెంట్ ఇంత సంతోషంగా జరగడం చూస్తున్నాను. ఈ విషయంలో నిర్మాతలను అభినందించాలి. ఎందుకంటే ఈ మధ్యకాలంలో ఏ ఈవెంట్ కూడా ఇంత అద్భుతంగా జరగలేదు. థియేటర్‌లలో కూడా సందడి కనిపించడం లేదు. ఈ 'సమ్మర్ హాలీడేస్'తో థియేటర్‌లలో సందడి నెలకొనాలని కోరుకుంటున్నా'' అని దిల్‌రాజు తెలిపారు.

'ధురంధర్' ప్రొడక్షన్ డిజైనర్‌పై లైంగిక వేధింపుల కేసు

ఇండస్ట్రీలో సంచలనం సృష్టించిన చిత్రం 'ధురంధర్'. తాజాగా ఈ చిత్రానికి వర్క్ చేసిన ప్రొడక్షన్ డిజైనర్ సైనీ జోహ్రాపై లైంగిక వేధింపుల ఆరోపణలతో పోలీసులు కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రాజెక్టులో అసిస్టెంట్ ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేసిన ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చండీగఢ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.గతేడాది సెప్టెంబర్ 10న సినిమాకు సంబంధించిన చర్చల కోసం సైనీ తనను చండీగఢ్‌లోని ఒక హోటల్‌కు రావాలని కోరినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్కడికి వెళ్లాక అసభ్యకరంగా ప్రవర్తించారని ఆమె ఆరోపించారు. తాను అనారోగ్యానికి గురైనప్పటికీ, అక్కడి నుండి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారని తెలిపారు. అంతేకాకుండా ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే కెరీర్ దెబ్బతింటుందని నిందితుడు బెదిరించినట్లు ఆమె ఫిర్యాదులో వివరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'పెద్ది'.. ఆ ఒక్క డైలాగ్‌కు 78 టేక్స్..

'పెద్ది' దర్శకుడు బుచ్చిబాబు (Peddi Director)పై బాలీవుడ్ ప్రముఖ నటుడు బొమన్ ఇరానీ (Boman Irani) ప్రశంసలు కురిపించారు. డైరెక్టర్ చిన్నోడైనా.. ఆయన విజన్ చాలా పెద్దదని అన్నారు. అనుకున్న అవుట్‌పుట్ వచ్చేంత వరకూ కష్టపడుతూనే ఉంటారంటూ.. ఓ డైలాగ్‌కు ఏకంగా 78 టేక్స్ తీసుకున్న విషయాన్ని గుర్తుచేసుకున్నారు. అది మరేదో కాదు.. ట్రైలర్‌లో చూపించిన 'క్రాస్ ఓవర్ అథ్లెట్' డైలాగ్. ఆవేశంతో 'ఎవడాడు?' అంటూ యాక్టర్ రవికిషన్ అడిగే షాట్ తర్వాత వస్తుందీ డైలాగ్. హీరో రామ్‌చరణ్ (Ram Charan)ను ఉద్దేశించి.. క్రాస్ ఓవర్ అథ్లెట్ అంటూ బొమన్ ఉద్వేగభరితంగా చెప్పిన తీరు ట్రైలర్‌లో ఓ హైలైట్. రామ్‌చరణ్, దివ్యేందు శర్మలతో కలిసి పాల్గొన్న చిట్‌చాట్‌లో బొమన్ ఈ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. 'పెద్ది'.. క్రీడా నేపథ్యంతో కూడిన దేశభక్తి చిత్రమని పేర్కొన్నారు.

దివ్యేందు ఆఫ్‌స్క్రీన్‌లో జెంటిల్‌మ్యాన్: రామ్‌చరణ్

'పెద్ది'లో కీలక పాత్ర పోషించిన దివ్యేందు శర్మపై రామ్‌చరణ్ ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఆయన ఆఫ్‌స్క్రీన్‌లో జెంటిల్‌మ్యాన్ అని, ఆన్‌స్క్రీన్‌పై కాదని చమత్కరించారు. సూపర్‌హిట్ వెబ్‌సిరీస్ 'మీర్జాపూర్'లో దివ్యేందు పోషించిన పాత్రనుద్దేశించి ఇలా వ్యాఖ్యానించారు. 'పెద్ది' గురించి మాట్లాడుతూ.. రోజూ ఈ సినిమాలోని పాత్ర, షూటింగ్ గురించి కుటుంబ సభ్యులు, స్నేహితులతో మాట్లాడేవాడినని, అంతగా లీనమయ్యానని తెలిపారు. తన కెరీర్‌లో చాలా తక్కువ సినిమాలకే ఇలా జరిగిందన్నారు.

కొత్త స్వరాలు... సరికొత్త హంగులు

తన పదో సినిమా కోసం కలయిక ఖరారు నుంచే అందరి దృష్టినీ ప్రత్యేకంగా ఆకర్షించారు అనిల్ రావిపూడి. 'మన శంకరవరప్రసాద్‌గారు'తో ఘన విజయాన్ని సొంతం చేసుకున్న ఆయన తదుపరి వెంకటేశ్ కల్యాణ్‌రామ్ కలయికలో మల్టీస్టారర్ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే ప్రథమార్ధం పూర్తి కాగా, ప్రస్తుతం ద్వితీయార్థం స్క్రిప్ట్ పనులు కొనసాగుతున్నాయి. జులై లేదా ఆగస్టులో ఈ సినిమా మొదలయ్యే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ సినిమా సరికొత్త హంగులతో రూపొందనున్నట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే సంగీత దర్శకుడిగా జి.వి.ప్రకాశ్‌కుమార్‌ని ఎంపిక చేశారు. తాను రూపొందిస్తున్న కథల్ని దృష్టిలో ఉంచుకుని, ఎప్పటికప్పుడు సంగీత దర్శకుల్ని మారుస్తుంటారు అనిల్ రావిపూడి. ఈసారి జి.వి.ప్రకాశ్‌కుమార్‌కు స్వరాల బాధ్యతల్ని అప్పజెప్పారు. కథ, కథనం పరంగానూ ఈ సినిమా మరింత ప్రత్యేకంగా ఉండేలా అనిల్ రావిపూడి రచన సాగుతున్నట్టు సమాచారం.

ఈ చిత్రంలో వెంకటేశ్ సరసన కీర్తిసురేశ్, కల్యాణ్‌రామ్ సరసన కృతిశెట్టి నటిస్తున్నారు. కలర్‌ఫుల్‌గా కనిపిస్తున్న ఈ కలయికలో సినిమా సంక్రాంతికి విడుదల లక్ష్యంగానే పట్టాలెక్కుతోంది.

ఆ అనుభూతులే స్ఫూర్తిగా... 'ఎల్లమ్మ'

తాను కథానాయకుడిగా 'ఎల్లమ్మ' సినిమాని చేయడానికి స్ఫూర్తినిచ్చిన విషయాల్ని ఓ వీడియోతో పంచుకున్నారు దేవిశ్రీప్రసాద్. సంగీత దర్శకుడిగా సుపరిచితమైన ఆయన కథానాయకుడిగా 'ఎల్లమ్మ' సినిమాతో తెరకు పరిచయం అవుతున్న సంగతి తెలిసిందే. వేణు ఎల్దండి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై శిరీష్ నిర్మిస్తున్నారు. తెలుగుతోపాటు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల దేవిశ్రీ ప్రసాద్ తన స్వగ్రామమైన వెదురుపాకని సందర్శించి, ఆ ఊరి జాతర వేడుకల్లో భాగమయ్యారు. అందుకు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఆ వీడియోలో ఆయన మాట్లాడుతూ ''మా నాన్న జన్మించిన ఊరు వెదురుపాక. ప్రకృతి, గ్రామీణ జీవన సౌందర్యం గురించి తెలుసుకోవాలని మా నాన్న చిన్నప్పుడు మమ్మల్ని తరచూ చెన్నై నుంచి వెదురుపాక తీసుకొచ్చేవారు.

మా మూలాలతో, మనుషులతో అనుబంధం కొనసాగాలని ఇక్కడే ఓ అందమైన ఇల్లు కూడా నిర్మించుకున్నాం. సంస్కృతి, జానపద కళలు, దైవత్వం ఎంత అందమైనవో నాకు నేర్పిన ఊరు ఇదే. ఆ అనుభూతులే నేను 'ఎల్లమ్మ' సినిమా చేయడానికి స్ఫూర్తినిచ్చాయ''న్నారు.

చునరీ... చునరీ రీమిక్స్ గీతం

పూజా హెగ్డే వరుణ్ ధావన్ మృణాల్ ఠాగూర్

హిందీ సినిమా 'బివీ నెం.1'(1999)లోని 'చునరీ చునరీ' అనే గీతంతో యువతని విశేషంగా ఆకట్టుకున్నారు బాలీవుడ్ అగ్రతార సల్మాన్ ఖాన్, సుస్మిత సేన్. ఇప్పుడీ పాటకి రీమిక్స్ గీతంలో ఇద్దరు నాయికలతో కలిసి స్టెప్పులేస్తూ అలరించడానికి సిద్ధమయ్యాడు హీరో వరుణ్ ధావన్. ఆయన, కథానాయికలు పూజా హెగ్డే, మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో రాబోతున్న చిత్రం 'హై జవానీ తో ఇష్క్ హోనా హై'. ఈ చిత్రంలో బాలీవుడ్ ఐకానిక్ గీతం 'చునరీ చునరీ'ని రీమేక్ చేశారు. ఈ సినిమా జూన్ 5న విడుదల కానున్న నేపథ్యంలో చిత్రబృందం తాజాగా ఈ పాటని సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది. 'ఎగిరే పక్షి ఎగురుతూనే ఉంది..కానీ నా మనసే గాలిపటంలా నిన్నే కలవరపెడుతోంది ఇదేంటి?' 'నా ప్రియతమా నీకెలా చెప్పాలి' లాంటి లిరిక్స్‌తో సాగే ఈ గీతం వరుణ్, పూజా, మృణాల్‌ల కెమెస్ట్రీతో ఆకట్టుకుంటోంది. ఈ పాటని సింగ్, జోనితా గాంధీ, అనురాధ శ్రీరామ్ తదితరులు కలిసి ఆలపించారు. డేవిడ్ ధావన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రమేశ్ తౌరనీ నిర్మించారు. మౌనీరాయ్, చుంకీ పాండే, జిమ్మి షెర్గిల్ తదితరులు ఈ సినిమాలో కీలకపాత్రలు పోషించారు.

రెంటల్ విధానంలోనే 'పెద్ది'.. చిరంజీవి జోక్యంతో సద్దుమణిగిన వివాదం

అగ్ర నటుడు చిరంజీవితో తెలంగాణ ఎగ్జిబిటర్ల సమావేశం ముగిసింది. ఈ భేటీలో సినీ పరిశ్రమలో పర్సంటేజీల వివాదం సద్దుమణిగింది. చిరంజీవి జోక్యంతో పర్సంటేజీ నిర్ణయం వాయిదా పడింది. జూన్ 4న విడుదల కానున్న 'పెద్ది' సినిమాను రెంటల్ విధానంలోనే ప్రదర్శించాలని ఎగ్జిబిటర్లు నిర్ణయించారు. జూన్ 30 తర్వాత విడుదలయ్యే చిత్రాలకు పర్సంటేజీ విధానం వర్తింపజేస్తామన్నారు. ఈ మేరకు తెలంగాణ ఎగ్జిబిటర్లు తీసుకున్న నిర్ణయంపై చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. ఫిల్మ్ ఛాంబర్ కమిటీ నివేదిక మేరకు నడుచుకోవాలని సూచించారు.

ఆ రోజు నుంచి పర్సంటేజీ విధానంలోనే..

చిరంజీవితో భేటీ ముగిసిన అనంతరం.. ఎగ్జిబిటర్ల తరఫున తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెస్‌నోట్ విడుదల చేసింది. జూన్ 30లోగా పర్సంటేజీ సమస్యను పరిష్కరిస్తానని చిరంజీవి హామీ ఇచ్చారని చెప్పింది. జులై 3 నుంచి కొత్త పర్సంటేజీ విధానం అమలు కానుందని తెలిపింది. ఆ రోజు నుంచి రెంటల్ సిస్టమ్ ఉండదని, పర్సంటేజీ విధానంలోనే సినిమాల ప్రదర్శన ఉంటుందని స్పష్టం చేసింది. సింగిల్ స్క్రీన్లలోనూ పర్సంటేజీ విధానంలోనే సినిమాలను ప్రదర్శిస్తామని తెలంగాణ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. దీనిపై కొన్ని రోజులుగా చర్చలు జరిగాయి. సమస్య పరిష్కారం కోసం చలన చిత్ర వాణిజ్య మండలి.. నిర్మాతలు, పంపిణీదారులు, ప్రదర్శనకారులతో ఓ ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. అయితే, 'పెద్ది' చిత్రాన్ని అద్దె విధానంలో ప్రదర్శించలేమని ఓ సమావేశంలో పలువురు ఎగ్జిబిటర్లు అభిప్రాయం వ్యక్తంగా చేయగా.. కొందరు నిర్మాతలు వ్యతిరేకించారు. దీంతో, ఈ వ్యవహారంపై చిరంజీవి జోక్యం చేసుకున్నారు. ఈనెల 25న ఆయనతో భేటీ అయిన ఎగ్జిబిటర్లు.. నేడు (బుధవారం) మరోసారి సమావేశమై, తుది నిర్ణయాన్ని చెప్పారు. రామ్‌చరణ్ హీరోగా తెరకెక్కిన చిత్రమే 'పెద్ది'.

చిరంజీవి దృష్టికి సింగిల్ థియేటర్ల సమస్యలు

సోమవారం ఎగ్జిబిటర్లతో సమావేశం , త్వరలోనే ఛాంబర్ ఉపకమిటీతో భేటీ

రెండు రోజుల్లో పరిష్కారం ఉంటుందన్న దిల్‌రాజు

సింగిల్ థియేటర్లలో సినిమాల ప్రదర్శనకు సంబంధించిన పంచాయితీ అగ్ర కథానాయకుడు చిరంజీవి దగ్గరకు చేరింది. సోమవారం ఆయన నివాసంలో తెలంగాణ ఎగ్జిబిటర్లతోపాటు, తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు డి.సురేశ్‌బాబు, తెలంగాణ ఎఫ్.డి.సి ఛైర్మన్ దిల్‌రాజు, సీనియర్ నిర్మాతలు కె.ఎల్.నారాయణ, అల్లు అరవింద్, సునీల్ నారంగ్ తదితరులు సమావేశమయ్యారు. గంటకుపైగా వీరి మధ్య చర్చలు జరిగాయి. సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు... అద్దె విధానంలో కాకుండా, పర్సంటేజీ ప్రాతిపదికన ప్రదర్శనల ఆవశ్యకతని వివరించారు పలువురు ప్రదర్శనకారులు. చిరంజీవితో సమావేశం అనంతరం నిర్మాత, ఎఫ్.డి.సి.ఛైర్మన్ దిల్‌రాజు మాట్లాడుతూ ''పర్సంటేజీ విధానం డిమాండ్ వెనకున్న అన్ని విషయాల్నీ ప్రదర్శనకారులు వివరించారు. వారం కిందట చలన చిత్ర వాణిజ్య మండలి (ఛాంబర్) ఆధ్వర్యంలో ఏర్పాటైన ఉపకమిటీ నుంచి మరిన్ని వివరాల్ని తెప్పించుకుని పరిశీలిస్తానన్నారు చిరంజీవి. ఆయన అన్ని సమస్యల్నీ అర్థం చేసుకుని, అందరితో మాట్లాడి కమిటీ ద్వారానే త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం లభించేలా ప్రయత్నం చేద్దామని మాటిచ్చారు. దాంతో ప్రదర్శనకారులంతా సంతోషంగా ఉన్నారు. రెండు రోజుల్లో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అందుకు సంబంధించిన వివరాల్ని చలన చిత్ర వాణిజ్య మండలి అధికారికంగా ప్రకటిస్తుంది'' అన్నారు. ఈ సమస్య పరిశ్రమకు సంబంధించినదని, 'పెద్ది' సినిమా ప్రస్తావన ఏదీ రాలేదని ఆయన చెప్పారు. తెలంగాణ ప్రదర్శనకారుల సంఘం కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ ''సింగిల్ స్క్రీన్‌లు ఎదుర్కొంటున్న సమస్యల్ని సానుకూలంగా విని చాలా బాగా స్పందించారు కథానాయకుడు చిరంజీవి. సింగిల్ స్క్రీన్‌లకు ఇన్ని ఇబ్బందులు ఉన్నాయా? ఇన్ని థియేటర్లు మూతపడుతున్నాయా? అని ఆయన అడిగి తెలుసుకున్నారు. చలన చిత్ర వాణిజ్య మండలి ఏర్పాటు చేసిన కమిటీని కూడా పిలిచి మాట్లాడతానని చెప్పారు. మేం కూడా ప్రదర్శనకారులతో కూర్చుని మాట్లాడి తుది నిర్ణయం తీసుకుంటాం'' అన్నారు. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ప్రస్తుతం కొనసాగుతున్న అద్దె విధానంలో కాకుండా, మల్టీప్లెక్స్ హాళ్ల తరహాలోనే పర్సెంటేజీ ప్రాతిపదికన ప్రదర్శనలు నిర్వహిస్తామని థియేటర్ యాజమాన్యాలు నిర్ణయం తీసుకొన్న విషయం తెలిసిందే. దీనిపై నిర్మాతలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో సమస్య జఠిలమైంది. ఛాంబర్ కలగజేసుకుని, ఈ సమస్య పరిష్కారానికి ఇటీవల నిర్మాతలు, ప్రదర్శనకారులు, పంపిణీదారుల్ని కలిపి ఉప కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కమిటీ కోరుతున్న గడువుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రదర్శనకారులు త్వరలోనే విడుదల కానున్న 'పెద్ది' సినిమా నుంచే పర్సెంటేజీ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈ సమావేశంలో చిరంజీవి స్పందిస్తూ... ''చలన చిత్ర వాణిజ్య మండలి నిర్ణయానికి కట్టుబడి ఉండటం అందరికీ సముచితం. ఇంతకుముందు కమిటీల పనితీరుపై సింగిల్ స్క్రీన్ థియేటర్ల యాజమాన్యాల్లో కొంత అసంతృప్తి, అపనమ్మకం ఉందన్న విషయం ఈ సమావేశంతో అర్థమైంది. ఈసారి కమిటీకి నిర్దేశించిన జూన్ 30 లోపు అన్ని విషయాల్నీ పూర్తిగా పరిశీలించి అందరికీ న్యాయం జరిగేలా పర్సంటేజీ మోడల్‌పై ప్రతిపాదనల్ని సిద్ధం చేస్తుందనే నమ్మకం నాకు ఉంది. ఆ కమిటీ బాధ్యతలు పూర్తి చేసి నివేదిక ఇచ్చేలా నా వంతు ప్రయత్నం నేను చేస్తా'' అని హామీ ఇచ్చినట్టు సమాచారం.

ప్రపంచ రికార్డుతో ఇషా స్వర్ణం

మ్యూనిక్: హైదరాబాద్ అమ్మాయి ఇషా సింగ్ ప్రపంచ వేదికపై మరోసారి అదరగొట్టింది. ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో ఆమె ప్రపంచ రికార్డు బద్దలు కొడుతూ స్వర్ణం సాధించింది. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఫైనల్లో ఆమె అగ్రస్థానంతో భారత్‌కు టోర్నీలో తొలి పతకం అందించింది. 50 పాయింట్లకు 43 స్కోరు సాధించిన ఇషా ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఈ క్రమంలో కిమ్ యెజి (42 పాయింట్లుకొరియా) రికార్డును ఆమె బద్దలు కొట్టింది. మాజీ ప్రపంచ ఛాంపియన్ డొరీన్ వెన్‌కాంప్ (జర్మనీ) రజతం, మిరోస్లోవా (బల్గేరియా) కాంస్యం గెలిచారు. అంతకుముందు ర్యాపిడ్ ఫైర్ రౌండ్లో ఇషా 294, ప్రిసిషన్ రౌండ్లో 293 స్కోర్లతో ఫైనల్‌కు అర్హత సాధించింది. స్టార్ షూటర్ మను బాకర్ 582తో 12వ స్థానానికి పరిమితమై, ఫైనల్ చేరలేకపోయింది. గురువారం 10 మీటర్ల రైఫిల్ పోటీలో ఇలవేణిల్ వలరివాన్, ఆర్య బోర్సే, సాక్షి పడేకర్ బరిలోకి దిగనున్నారు.

దీప్తి, అకీరాలకు స్వర్ణాలు

రవికి రజతం.. సంజయ్, కనకప్పలకు కాంస్యాలు
ఇండియన్ ఓపెన్ పారా అథ్లెటిక్స్‌లో 'లక్ష్య' మెరుపులు

హైదరాబాద్ : ఇండియన్ ఓపెన్ అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ఈనాడు సీఎస్ఆర్ కార్యక్రమం 'లక్ష్య' అథ్లెట్లు అదరగొడుతున్నారు. బెంగళూరులో జరుగుతున్న ఈ టోర్నీలో జీవాంజి దీప్తి, బానోతు అకీరా నందన్ స్వర్ణ పతకాలు సాధించగా.. అసరెల్లి రవికిరణ్ రజతం.. సంజయ్ రెడ్డి, సి.కనకప్ప నీలం కాంస్యాలు గెలిచారు. మహిళల టీ20 400 మీటర్ల పరుగును దీప్తి 57.84 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచింది. పురుషుల 400మీ. పరుగులో అకీరా 52.06 సెకన్ల టైమింగ్‌తో అందరి కంటే ముందు రేసును పూర్తి చేశాడు. పురుషుల టీ37 విభాగం లాంగ్ జంప్‌లో రవికిరణ్ 5.07 మీటర్ల దూరం దూకి రెండో స్థానం సాధించగా.. డిస్కస్ త్రోలో ఎఫ్11 విభాగంలో సంజయ్ 32.22 మీటర్ల దూరం డిస్క్‌ను విసిరి మూడో స్థానంలో నిలిచాడు. కనకప్ప టీ44 విభాగం 100 మీటర్ల పరుగులో 12.99 సెకన్ల టైమింగ్‌తో మూడో స్థానంలో నిలిచాడు. ఈ టోర్నీలో ప్రదర్శన ఆధారంగా అథ్లెట్లను పారా ఆసియా క్రీడలకు ఎంపిక చేస్తారు.

ప్రిక్వార్టర్స్ లో ప్రణయ్, లక్ష్య

శ్రీకాంత్ పరాజయం ... సింగపూర్ ఓపెన్

సింగపూర్: సింగపూర్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో భారత స్టార్ షట్లర్లు హెచ్ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్ ప్రిక్వార్టర్స్‌లోకి దూసుకెళ్లారు. బుధవారం హోరాహోరీగా సాగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్లో ప్రణయ్ 1021, 2112, 2118తో అయిదో సీడ్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)ని ఓడించాడు. తొలి గేమ్ కోల్పోయిన ప్రణయ్ తర్వాత పుంజుకున్నాడు. రెండో గేమ్‌లో విరామ సమయానికి 117తో నిలిచిన అతడు.. ఆ తర్వాత కూడా ప్రత్యర్థికి అవకాశమివ్వకుండా గేమ్ గెలిచాడు. నిర్ణయాత్మక మూడో రౌండ్లో ఇద్దరూ హోరాహోరీగా పోరాడారు. 1816తో క్రిస్టీ మ్యాచ్ విజయానికి చేరువగా నిలవగా.. గొప్పగా పుంజుకున్న ప్రణయ్ అయిదు వరుస పాయింట్లతో అద్భుత విజయం సాధించాడు. 2021 తర్వాత క్రిస్టీపై గెలవడం ప్రణయ్‌కు ఇదే తొలిసారి. మరో పోరులో లక్ష్యసేన్ 2116, 2115తో లు గువాంగ్ జు (చైనా)ను 42 నిమిషాల్లో మట్టికరిపించాడు. కిదాంబి శ్రీకాంత్‌కు అదృష్టం కలిసి రాలేదు. అతను 2022, 2119, 1721తో లోహ్ కీన్ (సింగపూర్) చేతిలో పోరాడి ఓడాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల, తనీషా క్రాస్టో ద్వయం ప్రిక్వార్టర్స్ చేరింది. ఈ జోడీ 2114, 2022, 2113తో మలేసియా జంట వాంగ్ టియెన్, లిమ్ చ్యూపై గెలిచింది. మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోద్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఆమె 2111, 1921, 1221తో లిన్ సియాంగ్ టి (చైనీస్ తైపీ) చేతిలో ఓడింది. మహిళల డబుల్స్‌లో రుతుపర్ణశ్వేతపర్ణ 921, 1721తో అయింవరీశ్రీసకుల్‌జాన్‌పెంగ్ జంట చేతిలో పరాజయం పాలైంది.

చిన్నోడిని ఆపలేక..

ఐపీఎల్-19 నుంచి నిష్క్రమించిన హైదరాబాద్

క్వాలిఫయర్-2కు రాజస్థాన్ అర్హత
వైభవ్.. 29 బంతుల్లోనే 97

ఐపీఎల్ 19 ఎలిమినేటర్ కూడా ఏకపక్షమే. క్వాలిఫయర్ 1లో గుజరాత్‌ను బెంగళూరు కుమ్మేస్తే.. ఎలిమినేటర్ సన్‌రైజర్స్‌ను రాజస్థాన్ ఎత్తిపడేసింది. మరోసారి చిన్నోడే ప్రధాన ఆకర్షణ. ఆకాశమే హద్దుగా చెలరేగిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ.. ముల్లాన్‌పుర్‌లో పెను విధ్వంసం సృష్టించాడు. బ్యాటు విరిగేలా, బంతి పగిలేలా కసిదీరా బాది సిక్స్‌ల మోత మోగించాడు. కళ్లు చెదిరే షాట్లతో అభిమానులను ఉర్రూతలూగించాడు. అతడి ధాటికి సన్‌రైజర్స్ కెప్టెన్ కమిన్స్ నాలుగు ఓవర్లలో ఏకంగా 64 పరుగులు సమర్పించుకున్నాడు. వైభవ్‌తో పాటు జురెల్ కూడా చెలరేగడంతో మొదట కొండంత స్కోరు చేసిన రాజస్థాన్.. అనంతరం సన్‌రైజర్స్‌ను చుట్టేసింది. ఓ ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన బ్యాటర్‌గా వైభవ్ (65 సిక్స్‌లు) ఘనత సాధించాడు. గేల్ పేరిట ఉన్న రికార్డు (59 సిక్స్‌లు)ను అతడు బద్దలు కొట్టాడు. ఫైనల్లో చోటు కోసం రాజస్థాన్ శుక్రవారం క్వాలిఫయర్ 2లో గుజరాత్‌ను ఢీకొంటుంది.

కష్టపడి ఐపీఎల్ ప్లేఆఫ్స్ చేరిన రాజస్థాన్ రాయల్స్.. అసలు పోరులో అదరగొట్టింది. బుధవారం జరిగిన ఎలిమినేటర్‌లో 47 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ఘనవిజయం సాధించింది. వైభవ్ సూర్యవంశీ (97; 29 బంతుల్లో 5×4, 12×6) రెచ్చిపోవడంతో మొదట రాజస్థాన్ 8 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. ధ్రువ్ జురెల్ (50; 21 బంతుల్లో 5×4, 3×6) కూడా సత్తా చాటాడు. భారీ లక్ష్య ఛేదనలో సన్‌రైజర్స్ చేతులెత్తేసింది. ఆర్చర్ (3/58), ఇతర బౌలర్ల ధాటికి 19.2 ఓవర్లలో 196 పరుగులకే ఆలౌటైంది. నితీశ్ కుమార్ రెడ్డి (38; 20 బంతుల్లో 3×4, 2×6) టాప్ స్కోరర్. ఇషాన్ కిషన్ (33; 11 బంతుల్లో 3×4, 3×6), సలీల్ అరోరా (35; 21 బంతుల్లో 2×4, 2×6) రాణించారు. రెండొందలకు చేరువగా వెళ్లినా, సన్‌రైజర్స్ ఓటమి కనిపించే దాని కన్నా పెద్దదే. ఆ జట్టు చివరి ఓవర్ వరకు ఆడినా.. పరాజయం చాలా ముందే ఖరారైంది. ఓటమితో సన్‌రైజర్స్ టోర్నీ నుంచి నిష్క్రమించింది.

తడబడిన సన్‌రైజర్స్: లక్ష్యం చాలా పెద్దదే అయినా.. సన్‌రైజర్స్‌కు భీకర బ్యాటింగ్ లైనప్ ఉండడంతో ఆ జట్టు అవకాశాలు కొట్టిపారేయలేని స్థితి. ఈ నేపథ్యంలో బరిలోకి దిగిన హైదరాబాద్‌ను రెండో బంతికే ఆర్చర్ దెబ్బతీశాడు. విధ్వంసక వీరుడు అభిషేక్‌ను అతడు ఔట్ చేశాడు. అయితే ఇషాన్ కిషన్, హెడ్ (17) చెలరేగడంతో సన్‌రైజర్స్ మూడో ఓవర్లోనే 50 దాటింది. దీంతో ఆ జట్టు రేసులో ఉన్నట్లే కనిపించింది. కానీ జోరు మీదున్న ఇషాన్‌ను ఆర్చర్ ఔట్ చేయడంతో ఇన్నింగ్స్ గతి తప్పింది. హైదరాబాద్ వేగంగా ఓటమి వైపు సాగింది. స్మరణ్ (1)తో పాటు హిట్టర్లు హెడ్, క్లాసెన్ (18) పెవిలియన్‌కు క్యూ కట్టారు. అద్భుత ఫామ్‌లో ఉన్న ప్రమాదకర క్లాసెన్‌ను ఏడో ఓవర్లో యశ్‌రాజ్ పుంజా వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో సన్‌రైజర్స్ అవకాశాలు బాగా సన్నగిల్లాయి. క్లాసెన్ అయిదో వికెట్‌గా నిష్క్రమించేటప్పటికి ఆ జట్టు స్కోరు 81 పరుగులే. ఆ దశలో నితీశ్ కుమార్ రెడ్డి, సలీల్ అరోరా ధనాధన్ బ్యాటింగ్‌తో 24 బంతుల్లోనే 56 పరుగులు జోడించడంతో సన్‌రైజర్స్‌లో కాస్త ఆశలు రేగే ఉంటాయి. కానీ ఆ సమయంలో కూడా రాజస్థాన్ స్పష్టంగా పైచేయిలో ఉంది. 11వ ఓవర్లో జట్టు స్కోరు 137 వద్ద నితీశ్ ఔట్ కావడం, వెంటనే కమిన్స్ (1) కూడా వెనుదిరగడంతో సన్‌రైజర్స్‌లోని ఆ చిన్ని ఆశకు కూడా తెరపడ్డట్లయింది. సాధించాల్సిన రన్‌రేట్ భారీగా పెరిగిపోయింది. కొన్ని బలమైన షాట్లు ఆడిన సలీల్ అరోరాను 15వ ఓవర్లో జడేజా ఔట్ చేయడంతో 163/8తో నిలిచింది సన్‌రైజర్స్. ఆ జట్టు ఓటమి లాంఛనమే అయింది. హైదరాబాద్ మిగతా ఆట కేవలం ఓటమి అంతరాన్ని తగ్గించుకోవడానికే.

చితక్కొట్టుడు: వైభవ్ సూర్యవంశీ వీర విధ్వంసంతో అంతకుముందు రాజస్థాన్ కొండంత స్కోరు సాధించింది. నిజానికి ఆ జట్టు చేసిన 243 కూడా అనుకున్న దాని కన్నా తక్కువే. అంచనాలను అందుకుంటూ, తన విధ్వంసాన్ని పరాకాష్టకు చేర్చుతూ 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ విరుచుకుపడ్డాడు. బౌలర్లపై భీకర దాడికి దిగిన అతడు.. ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేసి, రాజస్థాన్ భారీ స్కోరు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. సన్‌రైజర్స్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా.. కెప్టెన్ కమిన్స్ బౌలింగ్ దాడిని మొదలెట్టాడు. 141 కిలోమీటర్ల వేగంతో కమిన్స్ వేసిన బంతిని అతడి తలమీదుగా స్టాండ్స్‌లోకి కొట్టి వైభవ్ దంచుడు ఆరంభించాడు. ఆ తర్వాత అతడి విధ్వంసం అలుపెరగకుండా సాగింది. మరోవైపు జైస్వాల్ (29; 29 బంతుల్లో 4×4) నిలవగా.. కేవలం సిక్స్‌లు కొట్టడమే లక్ష్యంగా బ్యాటింగ్ చేసిన వైభవ్, భారీ షాట్లతో సన్‌రైజర్స్ బౌలింగ్‌ను తుత్తునియలు చేశాడు. ఏ బౌలర్‌నూ వదల్లేదు.. ఇషాన్ మలింగ షార్ట్ బంతిని హుక్ షాట్‌తో స్టాండ్స్‌లో పంపిన వైభవ్.. తర్వాతి ఓవర్లో వరుసగా 6, 6, 6తో కమిన్స్‌కు చుక్కలు చూపించాడు. సాకిబ్ ఓవర్లోనూ మూడు సిక్స్‌లు బాదేసి 16 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. ఆ తర్వాత కూడా సన్‌రైజర్స్ బౌలర్లను ఉతికేశాడు. పిడుగుల్లాంటి షాట్లను కొనసాగించిన వైభవ్.. హింగే ఓవర్లో మూడు సిక్స్‌లు, రెండు ఫోర్లు బాదేశాడు. క్రిస్ గేల్ పేరిట ఉన్న ఫాస్టెస్ట్ ఐపీఎల్ సెంచరీ రికార్డును బద్దలు కొట్టేలా కనిపించాడు. కానీ ఎనిమిదో ఓవర్లో జట్టు స్కోరు 125 వద్ద ఔటయ్యాడు. కాసేపటికే జైస్వాల్ కూడా వెనుదిరిగినా.. సన్‌రైజర్స్‌కు ఉపశమనం లభించలేదు. ధ్రువ్ జురెల్, రియాన్ పరాగ్ (26; 12 బంతుల్లో 2×4, 2×6) చెలరేగడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. జురెల్ 20 బంతుల్లోనే అర్ధశతకాన్ని అందుకున్నాడు. హింగే బౌలింగ్‌లో అతడు ఔట్ కావడంతో 55 (21 బంతుల్లో) పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. 15 ఓవర్లలో 207/3తో నిలిచిన రాజస్థాన్.. సన్‌రైజర్స్ అందుకోలేనంత పెద్ద స్కోరు చేస్తుందని భావించారంతా! కానీ హైదరాబాద్ బంతితో గొప్పగా పుంజుకుంది. రాజస్థాన్‌కు కళ్లెం వేసింది. ఆఖరి అయిదు ఓవర్లలో 36 పరుగులే ఇచ్చి 5 వికెట్లు పడగొట్టింది. సూపర్‌గా బౌలింగ్ చేసిన నితీశ్ కుమార్ రెడ్డి ఓ ఓవర్లో 5 పరుగులే ఇచ్చి ఆర్చర్‌ను ఔట్ చేశాడు. ఆ ఓవర్లో ఫెరీరా రనౌటయ్యాడు కూడా. చివరి ఓవర్లో సాకిబ్ కూడా 5 పరుగులిచ్చి ఓ వికెట్‌ను చేజిక్కించుకున్నాడు.

రాజస్థాన్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) అభిషేక్ (బి) శివాంగ్ 29; వైభవ్ (సి) స్మరణ్ (బి) హింగే 97; జురెల్ (సి) నితీశ్ (బి) హింగే 50; పరాగ్ (సి) క్లాసెన్ (బి) హింగే 26; ఫెరీరా రనౌట్ 12; శానక (సి) అభిషేక్ (బి) మలింగ 5; జడేజా నాటౌట్ 12; ఆర్చర్ (సి) అభిషేక్ (బి) నితీశ్ 4; బర్గర్ రనౌట్ 1; సుశాంత్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 6

మొత్తం: (20 ఓవర్లలో 8 వికెట్లకు) 243;

వికెట్ల పతనం: 1125, 2137, 3192, 4207, 5214, 6234, 7238, 8240;

బౌలింగ్: కమిన్స్ 40640; మలింగ 40401; సాకిబ్ 40520; హింగే 40543; శివాంగ్ 2019 1; నితీశ్ 20121

హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) జురెల్ (బి) ఆర్చర్ 0; హెడ్ (బి) ఆర్చర్ 17; ఇషాన్ (సి) ఫెరీరా (బి) ఆర్చర్ 33; స్మరణ్ (సి) ఆర్చర్ (బి) బర్గర్ 1; క్లాసెన్ ఎల్బీ (బి) పుంజా 18; నితీశ్ (సి) శానక (బి) జడేజా 38; అరోరా (సి) బర్గర్ (బి) జడేజా 35; కమిన్స్ (సి) ఆర్చర్ (బి) సుశాంత్ 1; శివాంగ్ (సి) వైభవ్ (బి) సుశాంత్ 27; మలింగ (సి) ఆర్చర్ (బి) బర్గర్ 5; సాకిబ్ నాటౌట్ 5; ఎక్స్‌ట్రాలు 16,

మొత్తం: (19.2 ఓవర్లలో ఆలౌట్) 196;

వికెట్ల పతనం: 10, 251, 352, 457, 581, 6137, 7-13-9, 8-16-3, 9-18-7;

బౌలింగ్: ఆర్చర్ 4-0-58-3; బర్గర్ 3-0-26-2; బ్రిజేశ్ 3-0-31-0; పుంజా 4-0-39-1; సుశాంత్ 2.2-0-21-2; జడేజా 3-0-21-2

కప్పు ముంగిట కీలక పోరు

ఇంగ్లాండ్‌తో భారత అమ్మాయిల టీ20 సిరీస్ నేటి నుంచే
తొలి టీ20 రాత్రి 11 నుంచి

చెమ్‌స్‌ఫర్డ్: టీ20 ప్రపంచకప్ ముంగిట భారత మహిళల జట్టు కీలక పోరుకు సిద్ధమైంది. ఇంగ్లాండ్‌తో మూడు టీ20ల సిరీస్ గురువారమే ఆరంభం కానుంది. జూన్ 12న టీ20 ప్రపంచకప్ ఆరంభం కానుండగా.. దానికి ముందు భారత అమ్మాయిలు ఆడే చివరి సిరీస్ ఇదే. ప్రపంచకప్ జరిగే ఇంగ్లాండ్‌లోనే సిరీస్ కావడంతో ఆ మెగా టోర్నీకి ఇది చక్కటి సన్నాహకం అవుతుందనడంలో సందేహం లేదు. అయితే గత నెల దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌లో 14తో ఓటమి పాలైన హర్మన్‌ప్రీత్ సేన.. బలమైన ఇంగ్లాండ్‌ను దాని సొంతగడ్డపై ఎంతమేర నిలువరించగలదో చూడాలి. జట్టు కూర్పుపై ఒక అంచనాకు రావడానికి ఈ సిరీస్ మంచి అవకాశం. బ్యాటింగ్‌లో నిలకడగా రాణించలేకపోవడం, బంతితో కీలక సమయాల్లో వికెట్లు పడగొట్టకపోవడం దక్షిణాఫ్రికా పర్యటనలో ఓటములకు కారణమయ్యాయి. ఇప్పుడు ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో ఆ బలహీనతలను అధిగమించాలని భారత్ పట్టుదలగా ఉంది. తెలుగమ్మాయిలు అరుంధతి రెడ్డి, శ్రీచరణి జట్టులో ఉన్నారు. బ్యాటింగ్‌లో స్మృతి మంధాన, షెఫాలి వర్మ, హర్మన్‌ప్రీత్, జెమీమా రోడ్రిగ్స్‌లపై భారత్ ఎక్కువ ఆశలు పెట్టుకుంది. వికెట్ కీపర్ రిచా ఘోష్ ఫినిషర్‌గా రాణించడం కీలకం. రేణుక సింగ్, క్రాంతి గౌడ్, అరుంధతి పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. మహిళల ప్రిమియర్ లీగ్‌లో ఆకట్టుకున్న కొత్త అమ్మాయి నందని శర్మకు తుది జట్టులో అవకాశం దక్కుతుందేమో చూడాలి. రాధ యాదవ్, యాస్తిక భాటియా తిరిగి జట్టులోకి వచ్చారు. సీనియర్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ, శ్రీ చరణి, శ్రేయాంక పాటిల్‌లతో స్పిన్ విభాగం మెరుగ్గానే ఉంది. మరోవైపు చార్లీ డీన్ నేతృత్వంలోని ఇంగ్లిష్ జట్టు సొంత గడ్డపై సిరీస్ గెలవాలని ఉత్సాహంగా ఉంది. లారెన్ బెల్, సోఫీ ఎకిల్‌స్టోన్, నాట్ సీవర్ బ్రంట్, లిన్సీ స్మిత్ ఆ జట్టుకు ప్రధాన బలం.

ఆ ఒక్క షాట్ పడుంటేనా..

రాజస్థాన్, హైదరాబాద్ మధ్య ఎలిమినేటర్ మ్యాచ్‌కు ముందు అందరి దృష్టీ నిలిచింది వైభవ్ సూర్యవంశీ మీదే. అతణ్ని ఆపడం మీదే సన్‌రైజర్స్ విజయం ఆధారపడి ఉందన్నది విశ్లేషకుల ఏకాభిప్రాయం. అయితే వైభవ్‌కు అడ్డుకట్ట వేయడానికి తమ దగ్గర మూడు రకాల వ్యూహాలున్నాయంటూ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ చెప్పడంతో ఆ జట్టు అభిమానులు ధీమాగా మ్యాచ్‌కు సిద్ధమయ్యారు. కానీ ఆ ధీమా అంతా సడలిపోవడానికి ఎంతో సమయం పట్టలేదు. తాను పవర్ ప్లే అయ్యే వరకు నిలిచినా మ్యాచ్ మీద ఆశలు వదులుకోవాల్సిందే అని మరోసారి రుజువు చేశాడు ఈ పాల బుగ్గల కుర్రాడు. తనను అడ్డుకోవడం కష్టమేమీ కాదన్నట్లు మాట్లాడిన సన్‌రైజర్స్ సారథిని మూడో ఓవర్లో అతను ఉతికారేసిన వైనం మ్యాచ్‌లో హైలైట్. ఆ ఓవర్లో హ్యాట్రిక్ సిక్సర్లతో కమిన్స్‌కే చుక్కలు చూపించాక, ఇంకే హైదరాబాద్ బౌలరూ అతణ్ని ఆపలేదని తేలిపోయింది. 16 బంతుల్లోనే అర్ధశతకం సాధించిన అతను.. ఇంకో 12 బంతులకే 97 పరుగుల మీదికి రావడంతో 13 ఏళ్లుగా నిలిచి ఉన్న ఐపీఎల్ ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డు (గేల్, 30 బంతుల్లో, పుణెపై) బద్దలైనట్లే అనుకున్నారంతా! గత ఏడాది 14 ఏళ్ల వయసులో తొలి ఐపీఎల్ ఆడుతూ 35 బంతుల్లోనే సెంచరీ కొట్టి ఔరా అనిపించాడు వైభవ్. ఈ ఏడాది 36 బంతుల్లో శతకం సాధించడంతో గేల్ రికార్డును త్వరలోనే అతను బద్దలు కొట్టేస్తాడనే అంచనా ఏర్పడింది. అందుకు తగ్గట్లే బుధవారం సన్‌రైజర్స్‌పై ఆకాశమే హద్దుగా చెలరేగుతూ గేల్ రికార్డుకు అత్యంత చేరువగా వచ్చాడు. హింగే వేసిన 8వ ఓవర్లో 6, 4, 4, 6, 6 బాది 97 మీదికి వచ్చిన వైభవ్.. తర్వాతి బంతికి బౌండరీ కొట్టి ఉంటే 29 బంతుల్లో శతకం సాధించి, గేల్ రికార్డును బద్దలు కొట్టేవాడు. కానీ ఆ బంతికి క్యాచ్ ఔట్ కావడంతో వైభవ్ తీవ్ర నిరాశతో మైదానాన్ని వీడాల్సి వచ్చింది.